Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 336 | కరీంనగర్ | ఆదివారం 26 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఎంతయినా ఒరిజినల్ ..ఒరిజినలే

- కవిత పార్టీపై బిఆర్ఎస్ సెటైర్లు
- అసలు ఒరిజినలే లేదుగా అంటూ టిఆర్ఎస్ ప్రతిదాడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లెరీ ఫొటోలు షేర్

11లో

## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి

11లో




## తెలంగాణ రాజకీయ యవనికపై

# కొత్త పార్టీ

- కవిత సారధ్యంలో తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం
- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర

11లో

## మరో 47మంది అజ్ఞాత

# మావోల లొంగుబాటు

- గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు
- తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్25: తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు

11లో

## తొలి ప్రైవేటు ఆర్బిటల్

# రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్25 : హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ పైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్

11లో

## తండ్రి పిట్టల దొర..బిడ్డ పిట్టల దొరసాని

- కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి
- మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపి అర్వింద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,ఏప్రిల్25 : సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని

11లో

## బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

- ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు
- సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు
- కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్,ఏప్రిల్25 : బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని

11లో

## రాష్ట్రంలో కర్కోటకుడి పాలన



- గురుకులాల్లో పిల్లలు చనిపోతున్న పట్టింపేదీ
- సిఎం రేవంత్ పాలనపై కవిత విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : ఇది ప్రారంభం మాత్రమే, ఇన్‌ఫ్రంట్ దేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్ అని కొత్తగా టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సేనను ప్రకటించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని.. ఒక రాజకీయ నేతను అలా అనకూడదు... కానీ, అనాల్సి వస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నా.. సీఎం మాట్లాడట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. అందుకే కర్కోటకుడని అంటున్నాం.. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం, రెండేళ్ల తర్వాత మనదే అధికారమన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కొత్త పార్టీ పేరు ప్రకటించిన ఆమె రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పాంచజన్యం పేరుతో ఐదు హామీలు ప్రకటించారు. ప్రభుత్వ స్కూళ్లను

11లో

## ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా...!

- గన్‌పార్క్ వద్ద అమరులకు కవిత నివాళి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 25 : చ్చితంగా ముఖ్యమంత్రి అయ్యి తీరుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో కొత్త విప్లవం మొదలైందని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇవాళ పార్టీ ఆవిర్భావం సందర్భంగా.. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేశారు. ఆవిర్భావ సభకు ర్యాలీగా వెళ్తున్న కవితను మీడియా ప్రశ్నించగా.. ఈ మేరకు సమాధానమిచ్చారు. అంతకుముందు ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత.. తన భర్త, కుటుంబ సభ్యుల

11లో

## గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ




- మన మనిషి కాదు...మర మనిషిగా మారిన కెసిఆర్
- బిఆర్ఎస్ తెలంగాణ ఆత్మను కోల్పోయింది
- టిఆర్ఎస్ అధినేత్రి కవిత విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్ అని కల్వకుంట్ల కవిత అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో మర్చిపోలేని రోజుగా అభివర్ణించారు. 'నేను అమ్మవారి భక్తురాలిని. నాకు సింగరేణి చాలా ఇష్టం. మీకంటే ఆడబిడ్డలంటే మరింత ఇష్టం. రాష్ట్రంలో అంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా తెలంగాణ జాగృతి ఎంతో కీలకంగా పనిచేసింది. బతుకమ్మ పాట వచ్చాక మన సంస్కృతికి ఊపిరి వచ్చింది. ఏమేమి కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో ఆ కలలో నిజం

11లో

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 25:ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఈ ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం అడసర్లపాడుకు చెందిన శీలం పృథ్వీ రాజ్ సత్తుపల్లి లోని కోకో కోల కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు.శనివారం ఉదయం బైక్‌పై రేజర్ల వైపు సత్తుపల్లి వెళుతుండగా, అదే సమయంలో రాజస్థాన్‌కు చెందిన లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో పృథ్వీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కి తరలించారు.లారీని పోలీస్ స్టేషన్ ఒక తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ప్రమాదంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.



# భూపాలపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలు

## ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25: భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి మండల పరిధిలోని వేషాలపల్లి, కాసింపల్లి, గొర్లవేడు, వజినపల్లి, నేరేడు పల్లి, గుడాడ్‌పల్లి, కొంపల్లి, పుల్లూరి రామయ్యపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర రూ.2,389తో పాటు అదనంగా రూ.500 బోనస్ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత యంత్రాల ఆర్‌పీఎం 18 నుండి 20 వరకు ఉండేలా, అలాగే బ్లోయర్ ఆన్‌లో ఉంచే విధంగా కోత యంత్రాల యజమానులకు సూచించాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు తగ్గి నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎస్ఓ, డీఎం, వ్యవసాయ శాఖ అధికారులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, టౌన్ ప్రెసిడెంట్, జిల్లా ఆర్టీఏ మెంబర్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహంలో గ్రేష్మాలాసం-2026" వేసవి శిక్షణ శిబిరం

- ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25:భూపాలపల్లి పట్టణంలోని షెడ్యూల్డ్ కులాల కళాశాల బాలికల వసతి గృహంలో "గ్రేష్మాలాసం-2026" వేసవి శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ఎంతో ముఖ్యమని అన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సెలవులను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు, టౌన్ ప్రెసిడెంట్, కౌన్సిలర్లు, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళా వ్యతిరేక కాంగ్రెస్ నైజం మరోసారి బహిర్గతమైంది

## బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తి రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25: దేశ రాజకీయాల్లో మహిళల సాధికారతకు అత్యంత కీలకమైన సమయంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి తన ద్వంద్వ వైఖరిని బయటపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శనివారం చందుపట్ల కీర్తి రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, కార్పొరేటర్ చాడ స్వాతి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మహిళా సాధికారత, దేశంలో జరుగుతున్న తాజా పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ వైఖరిపై విస్తృతంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభలో కాంగ్రెస్ అడ్డుకున్నది కేవలం ఒక చట్ట సవరణ బిల్లును మాత్రమే కాదని, కోట్లాది మహిళల ఆశలను, వారి భవిష్యత్తును, రాజకీయాల్లో వారికి దక్కాల్సిన హక్కులను అడ్డుకోవడమేనని మండిపడ్డారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య ద్రోహమని పేర్కొన్నారు. విపక్షాల మొండి వైఖరి కారణంగా దేశ మహిళలు తమ హక్కులను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత విషయంలో కాంగ్రెస్ పార్టీ మాటలు ఒకలా, చేతలు మరోలా ఉన్నాయని, మహిళా వ్యతిరేక కాంగ్రెస్ నైజం మరోసారి బహిర్గతమైందని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, రాష్ట్ర నాయకులు బట్టు రవి, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, 6వ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల రేణుక, మీడియా ఇన్‌చార్జ్ మునీందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిఫ్, మహిళా మోర్చా నాయకురాలు బూర పద్మ, నాయకులు పొన్నాల కొమరన్న, శ్రీనివాస్, తాటికంటి రవికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ జర్నలిస్టుల సమావేశాలు విజయవంతం - టీఎస్‌జేయూ నాయకులు

## ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన కార్యక్రమం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25:తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్‌జేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ ఎక్స్ రోడ్డులో రెండు రోజుల పాటు నిర్వహించిన నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ జర్నలిస్టుల సమావేశాలు విజయవంతంగా ముగిశాయని టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి జర్నలిస్టు ప్రతినిధులు హాజరై సమావేశాలను విజయవంతం చేశారని వారు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో టీఎస్‌జేయూ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమం, భద్రత, హక్కుల సాధన వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో పలు రాష్ట్రాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగా, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక సూచనలు వచ్చినట్లు చెప్పారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రాయితీలు, హెల్త్ కార్డులు, గృహ పథకాలు, బీమా, పెన్షన్ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించినట్లు వివరించారు. జర్నలిస్టుల భద్రత, వృత్తి పరిరక్షణకు బలమైన చర్యలు అవసరమని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జర్నలిస్టు నాయకులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమావేశాలు జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని, టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్ నేతృత్వంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

### అర్హులైన పాత్రికేయులకు...

# ప్రభుత్వ నిబంధన ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25:అర్హులైన పాత్రికేయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం మధ్య సమాచార వారధులుగా పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తారని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. 2026--2028 సంవత్సరాలకు చెల్లుబాటు అయ్యే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్లైన్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్వో ఆన్లైన్ దరఖాస్తుల ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలనలో సంస్థ గుర్తింపు పత్రం, విద్యార్హతలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు మీడియా ప్రతినిధుల నుంచి 330 ఆన్లైన్ దరఖాస్తులు అందాయని, వాటిని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని డీపీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీపీఆర్వో శీలం శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు క్యాతం సతీష్ కుమార్, మంతెన సమ్మయ్య, ఎర్రం సతీష్ కుమార్, మోబిన్ అహ్మద్, జి. సారేశ్వరరావు, పాలకుర్తి మధు తదితరులు పాల్గొన్నారు. సామంతుల శ్యామ్ ప్రసాద్, జల్దీ రమేష్, మహమ్మద్ షమీ, అజ్మీర డాకు నాయక్ సమావేశానికి హాజరు కాలేకపోయారు.

# మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలి

## నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25:భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని స్పష్టం చేశారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణపురంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

## లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రేగొండ, ఏప్రిల్ 25:భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన లబ్ధిదారులకు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 47 మంది లబ్ధిదారులకు రూ.47,05,452 విలువ గల కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం గణపురం, పరశురాంపల్లి, గొల్లపల్లి, చల్వార్, లక్ష్మారెడ్డిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ మరియు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన సన్న ధాన్యానికి మద్దతు ధర రూ.2,389తో పాటు అదనంగా రూ.500 బోనస్ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు కోత యంత్రాల ఆర్‌పీఎం 18 నుండి 20 వరకు ఉండేలా, అలాగే బ్లోయర్ ఆన్‌లో ఉంచే విధంగా కోత యంత్రాల యజమానులకు సూచించాలని చెప్పారు. ఇలా చేయడం వల్ల ధాన్యంలో తాలు తగ్గి నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ ప్రమాణాలు, కొలతలు సక్రమంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎం సివిల్ సప్లై రాములు, వ్యవసాయ శాఖ అధికారులు, డీసీఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలకు అతీతంగా.. ప్రజా సంక్షేమమే లక్ష్యం

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**


**- రాయిగూడెం 'ప్రజా దర్బార్'లో ప్రజలతో ముఖాముఖి.**


**- న్యాయమైన సమస్య అయితే పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 25 : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో ప్రజలు తమ గోడును చెప్పుకునేందుకు సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టి సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. అక్కడికక్కడే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి పరిష్కరిస్తామని చెప్పారు. "రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలో చేపట్టిన ఈ ప్రయోగం రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి సమస్యలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు. "మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాది" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.





# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**- దేగాంలో మహిళ సమైక్యభవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే - రాష్ట్రములోనే మొదటి సారిగా భవన నిర్మాణమై ప్రారంభం - సర్పంచ్ సుష్మరెడ్డి పని తీరు పట్ల అభినందన**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 25 : ముధోల్ నియోజకవర్గంలోని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శనివారం భైంసా మండలం లోని దేగాం గ్రామం లో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ మహిళ సంఘభవనాన్ని ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధుల తో సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. భైంసా మండలానికి 40 కి పైగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్టంలో నే మొదటి సారిగా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినందుకు సర్పంచ్ సుష్మరెడ్డి, అధికారుల పని తీరును అయన అభినందించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు విన్నవించడం తో దశల వారిగా గ్రామ అభివృద్ధి కి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. సిరాల ప్రాజెక్ట్ ద్వారా దేగాం ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరగా, కొన్ని చోట్ల మచ్కల్ సమీపంలో కాలువను తవ్వేశారని 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి కాలువ ను పూర్తి స్థాయి లో నిర్మించి సాగునీటిని అందిస్తామన్నారు... అభివృద్ధే ధ్యేయం గా తాను ముందుకు సాగుతున్నాని, 28 ప్యాకేజి పూర్తి అయితే నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. అదే విధంగా భూగర్భజాలలను పెంచేందుకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని డిఆర్‌డిఏ పి డి. విజయలక్ష్మి సూచించారు. అనంతరం సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ తాను ఒక సామాన్య మహిళ నుండి సర్పంచ్‌గా కావడం లో గ్రామస్తుల ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందన్నారు.. గ్రామ అభివృద్ధి కి దశల వారిగా నిధులు ఇస్తున్న ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు చెప్పారు.. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే కు గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు స్వాగతించి శాలువ తో సత్కరించారు.. కార్యక్రమం లో అధికారులు, నాయకులు, ఆయా గ్రామల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# ఆరు నెలల పసి గుడ్డును స్మశాన వాటికలో వదిలేసిన అభాగ్య తల్లి

**స్థానికులను కంటతడి పెట్టించిన హృదయ విదారక సంఘటన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మణుగూరు, ఏప్రిల్ 25 : కన్న ప్రేమకు మించినది ఈ లోకంలో మరొకటి లేదని అంటారు. తల్లి గుండె తన బిడ్డ కోసం ఎన్ని త్యాగాలైనా చేస్తుందని మనం నమ్ముతాం. కానీ కొన్ని సందర్భాల్లో పరిస్థితులు, భయం, మోసం లేదా సమాజపు ఒత్తిళ్లు ఒక తల్లిని ఎంతటి కఠిన నిర్ణయానికైనా నెట్టేస్తాయి. అలాంటి హృదయ విదారక ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం పంచాయతీలో చోటుచేసుకుంది. గుట్ట మల్లారం వైకుంఠధామం స్మశాన వాటికలోని బాత్రూమ్‌లో ఆరు నెలల పసి గర్భం (బేబీ గర్ల్)ను గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లడం స్థానికులను కలచివేసింది. శనివారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి రావడంతో అక్కడికి చేరుకున్న ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఏ తల్లి కన్న బిడ్డో...ఏ పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకుందో... సమాజం భయపెట్టిందో, ఎవరో మోసం చేశారో తెలియదు. నవమాసాలు మోసి జన్మనివ్వాల్సిన పసి ప్రాణం ఇలా స్మశాన వాటికలో నిర్జీవంగా కనిపించడంతో ప్రతి హృదయం కలచిపోయింది. అభం శుభం తెలియని ఆ చిన్నారి జీవితం ప్రారంభం కాకముందే ముగియడం అందరినీ విషాదంలో ముంచేసింది. స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ అధికారులు మాట్లాడుతూ, ఎవరైనా పిల్లలను పెంచలేని పరిస్థితుల్లో ఉంటే, వారిని ఇలా రోడ్లపై లేదా నిర్జన ప్రదేశాల్లో వదిలేయకుండా తమకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. చట్టబద్ధంగా పిల్లలు లేని దంపతులకు అప్పగించే విధానం ఉందని, చిన్నారుల ప్రాణాలతో ఇలా ఆడుకోవడం అమానుషమని హెచ్చరించారు. ఈ ఘటన మరోసారి సమాజాన్ని ఆలోచింపజేస్తోంది...పాపం ఆ చిన్నారి తప్పేంటి?







# ప్రజల శ్రేయస్సే లక్ష్యం - ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి

**- నర్సాపూర్ మున్సిపాలిటీ నగరాభివృద్ధికి రూ.15 కోట్లు - జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**

**- సంబరంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు - బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**

**- నర్సాపూర్ మున్సిపాలిటీ 4, 6వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 25 : ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మంత్రి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజ యాదవ్, గ్రంధాలయ చైర్మన్ చిలె మల సుహాసినిరెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజి రెడ్డి ప్రజా ప్రతినిధులతో కలిసి, మంత్రి పాల్గొన్నారు. మొదటిగా నగర అభివృద్ధి పథకం కింద నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డితో మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి నర్సాపూర్ 04, 06వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 4వ వార్డు దుద్దాల దుర్గమ్మ భర్త అశోక్ 6వ వార్డు మహమ్మద్ షకీరా బేగం భర్త యూసఫ్ ఉద్దీన్ గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం నారాయణపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమ సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు సూచించారు. మున్సిపాలిటీ నగరాభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం ఉంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించే విధంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచితంగా అందిస్తున్నామని నమోదు పెంచుకోవాలని ఆ దిశలో జరిగే బడిబాట కార్యమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దారులు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలి


**జిల్లా ఎస్పీ నికిత పంత్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25 : పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా వసుధ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో జైనూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఆదివాసీ మహిళలకు ఉచిత కుట్టు యంత్రాల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన మహిళలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, ఇలాంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి సాధించి కుటుంబాన్ని పోషించుకునే సామర్థ్యం పొందడానికి ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన వసుధ ఫౌండేషన్‌కు ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేష్, ఎస్సై లు రవి కుమార్, విక్రమ్,గ్రామ సర్పంచ్ కొడప ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 40 మంది మహిళలు శిక్షణలో పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల పిల్లలకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూపాలపల్లి ఏరియా పరిధిలోని గనులు, విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల కోసం ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్ తెలిపారు. 2026-27 సమ్మర్ క్యాంప్ లో భాగంగా 18 ఏళ్ల లోపు బాలబాలికలకు ఈ శిబిరం అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఏప్రిల్ 28, 2026 మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు భూపాలపల్లి కృష్ణ కాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంబిస్తారని తెలియజేశారు . ఈ శిక్షణ ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు అలాగే సాయంత్రం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈశిబిరంలో బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో మంచి నైపుణ్యం కలిగిన శిక్షకులచే ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి క్రీడలో సుమారు 20 నుంచి 25 మంది వరకు పాల్గొనేలా 25 రోజులపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు ఆసక్తి గల ఉద్యోగులు తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 28 సాయంత్రం 5 గంటలలోపు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియం సిఈఆర్ క్లబ్ లో స్పోర్ట్స్ సూపర్ వైజర్ పర్స శ్రీనివాస్ ని సంప్రదించాలని సూచించారు. అదే రోజు సాయంత్రం నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

# కొత్తగూడెంలో త్వరలో అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ నిర్మాణం

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25 : భద్రాద్రి-కొత్తగూడెం పట్టణంలో క్రీడా వసతుల అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన క్రీడా సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశమైన ఆయన, వారి విజ్ఞప్తి మేరకు బృందావనం ప్రాంతంలో సుమారు 12 ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు. ఈ స్థలంలో 400 మీటర్ల అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పాల్వంచ లోని శ్రీనివాస్ కాలనీ గ్రౌండ్‌లో 200 మీటర్ల సింథటిక్ ట్రాక్, బ్యాడ్మింటన్ కోర్టుల నిర్మాణంతో పాటు, కొత్తగూడెం ప్రగతి మైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టు మరమ్మత్తులు, క్రికెట్ గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహిధర్, కోచ్ డి. మల్లికార్జున్ 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో అథ్లెటిక్స్‌లో సాధించిన విజయాలను గుర్తుచేస్తూ, త్వరలోనే 400 మీటర్ల ట్రాక్ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా పాల్వంచ శ్రీనివాస్ కాలనీ గ్రౌండ్‌లో 200 మీటర్ల ట్రాక్ అభివృద్ధి చేసి, త్వరలోనే క్రీడాకారుల ప్రాక్టీస్‌కు అందుబాటులోకి తీసుకురావాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌ను కోరారు.



# సత్తుపల్లి బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికులతో కాంగ్రెస్ సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 25 : తెలంగాణ రాష్టంలో ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమవడంతో ఖమ్మం జిల్లా సత్తుపల్లి బస్టాండ్‌లో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని కార్మికులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులతో జరిగిన చర్చలు విజయవంతం కావడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్ టీసీ కార్మికులతో కలిసి పూలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. అలాగే ఆర్ టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్,ఆర్ టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, సత్తుపల్లి మరియు కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏ ఎం సీ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మహిళా, యువజన, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# పాంచజన్యం పూరించిన కవిత

కల్వకుంట్ల కవిత...ఈ పేరు పెద్దగా పరిచయం అక్కర్లేదు. తెలంగాణలో కవిత అంటే బతుకమ్మ అన్న స్థాయిలో ప్రాచుర్యం పొందారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా దివిటీ పట్టి వెలగించారు. తండ్రి కెసిఆర్ ఒడిలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కవిత..ఇవాళ తండ్రి పార్టీని ధిక్కరించి.. తండ్రినే ఎదిరించి.. నిలదీసే స్థాయిలో..కొత్తగా పార్టీని ప్రకటించి పాంచజన్యం పూరించారు. ఒక్కరోజు తేడాలో పాత టిఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం జరుగనుంది. దానికి రెండ్రోజుల ముందు కవిత తన పార్టీ కోసం ఎంచు కున్న తేదీ యాదృచ్ఛికం కాకపోయినా...ముహూర్త బలం ఉండేవుంటుంది. ఓ మహిళగా కవిత మహిళా లోకానికి బాగా తెలుసు. బతుకమ్మతో తెలంగాణ సంస్కృతిని ప్రపంచా నికి చాటారు. తెలంగాణ ఉద్యమం లో మమేకం అయ్యారు. తెలంగాణ ఏర్పడితే అందరూ బాగుపడతారని నమ్మి అంతా కెసిఆర్ జెండా మోసారు. కానీ తెలంగాణ ఆగమయ్యింది. కెసిఆర్ కుటుంబం బాగుపడ్డది. అవినీతిలో ఆరితేరారు. లక్షల కోట్లు వెనకేసుకున్నారు. ఈ అవినీతి, తెలంగాణ ఆకాంక్షలను పక్కదారి పట్టించిన తీరుతోనే కెసిఆర్ పార్టీని ప్రజలు బొందపెట్టారు. టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చాక ఉన్న పేగుబంధం కూడా తెగిపోయింది. బిఆర్ఎస్ అవినీతిని ఎదరించిన రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో ప్రయాణిస్తున్నారు. రెండున్న రేళ్లు కావస్తున్నా..ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక పని చేయలేదు. రేషన్ కార్డులు ఇచ్చాం..సన్న బియ్యం ఇచ్చాం..ఇదే పల్లవి. కానీ ప్రజల బాధ మరోలా ఉంది. ధాన్యం కొనడం లేదు. గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఉద్యోగాలు దక్కడం లేదు. అవినీతి పెరిగింది. పైసా ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. కిందిస్థాయి నుంచి మంత్రుల వరకు అవినీతి అంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. వెలుగమట్ల ఘటన ఒక్కటి చాలు..పేదలను ఎంతగా రాచి రంపాన పెట్టారో అర్థం చేసుకోవచ్చు. 50శాతం ఉన్న మహిళలు. 50 శాతం ఉన్న దళిత,గిరిజన, బహుజనులకు రాజ్యాధికారంలో చోటులేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ...తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భావం అన్నది ఒక అవసరం. ఆవశ్యకత కూడా ఉంది. ప్రజల పక్షాన పోరాడాల్సిన పార్టీ ఒకటి ఇప్పుడు తక్షణా వసరంగా ఉంది. ఎందుకంటే రాజకీయ పార్టీలన్నీ తమ సొంత ఎజెండాతో పనిచేస్తున్నాయి. సొంత వ్యవహారాల కోసం పనిచేస్తున్నాయి. అన్నింటికి మించి అవినీతి, ఆశ్రిత పక్షపాతంలో కూరుకుపోయాయి. కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ఊదరగొట్టుడే తప్ప నిలబడి తెలంగాణ పురోగతికి చేసిందేమీ లేదు. నిత్యం విమర్శలు తప్ప మరో ఎజెండా దానికి లేదు. అందుకే గత ఏడాదిగా ప్రజల్లో తిరుగుతూ..వారి సమస్యలను వింటూ..సమస్యలపై పోరాడుతూ వస్తున్న కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. గతంలో ఓమారు పార్టీ పెడతామని ప్రకటించిన సమయంలో పార్టీ పేరు గురించి అడిగితే ..అప్రయత్నంగానే టిఆర్ఎస్ పేరు కూడా ఖాళీగా ఉందన్నారు. అయితే అంతా టిఆర్ఎస్ పేరును ఓన్ చేసుకుంటుందని భావించారు. కానీ తెలివిగా టిఆర్ఎస్‌నే ప్రకటించినా..తెలంగాణ రాష్ట్రసేనగా ప్రకటించి ఆశ్చర్య పరిచారు. ఇది ఓ రకంగా బిఆర్ఎస్ పార్టీకి షాక్ లాంటిదే. టిఆర్ఎస్ పార్టీని పునరుద్ధరించా లనుకున్న ఆ పార్టీకి ఇదో అశనిపాతం లాంటిదే .నిజానికి గత టిఆర్ఎస్‌లో ఉంటూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్న కవిత మాటలు ముమ్మాటికీ నిజం. జాగృతి ద్వారా తెలంగాణ సాంస్కృతిక దీపాలను వెలిగించారు. తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామంటే అందులో కవితనే కనిపిస్తారు. నిజానికి తెలంగాణ తెచ్చుకుంటే దరిద్రం పోతుందన్న భావనలో ఉండి పోరాడిన వారంతా ఆగమయ్యారు. ఆ కలలు నిజం కాలేదు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపో యింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించిన వారంతా భంగపడ్డారు. పోరాటంలో ముందున్న కోదండ రామ్ లాంటి వారు బయటకు తోయబడ్డారు. ఆయనే మరో పార్టీ పెట్టాల్సి వచ్చింది. కానీ ప్రజల మద్దతుల లేకపోవడం తో ఆయన ఇప్పుడు ఉనికి కోసం పాకులాడుతున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అక్రమాలను ప్రశ్నించే శక్తి కూడా లేకుండా పోయింది. తెచ్చుకున్న తెలంగాణలో రైతులకు బేడీలు పడ్డాయి.. లాఠీలు విరిగాయి. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం గుప్పిట్లో బతికారు. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బిక్కుబిక్కుమంటూ బతికింది. ఇవన్నీ కళ్లముందు కదలాడుతున్నాయి. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా మార్పు రాలేదు. మార్పు తెచ్చామని, స్వేచ్ఛను ఇచ్చామని ప్రకటించుకున్నా..అది సాకారంకాలేదు. సామాజిక తెలంగాణ అన్నది నినాదంగా మారింది. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాల నుకుంటున్న కవిత కష్టపడితే..ఆ పేరు సంపాదించుకోవచ్చు. కేవలం నినాదాల కోసం కాకుండా ప్రజలను అక్కున చేర్చుకునే అమ్మగా మారితే ప్రజలు బ్రహ్మరథం పడతారు. తెలంగాణ ప్రజలు నమ్మితే ప్రాణం ఇస్తారు. ఉద్యమకారులు పోరాడితేనే కొత్త రాష్ట్రం వచ్చింది. అది గుర్తించి కవిత అడుగుల వేయాల్సి ఉంటుంది. మాటలు చెప్పడం వేరు, అందుకు అనుగునంగా అడుగుల వేయడం వేరు. రాజకీయాల్లో చిరస్థాయిగా నిలవాలంటే నిబద్ధత ముఖ్యం. నిజాయితీ అవసరం. నిలబడే ధైర్యం కావాలి. ప్రజలను ఆకట్టుకునే ప్రసంగాలే కాదు.. పనులు చేసే ధైర్యం కనిపించాలి. కవిత ప్రకటించిన ఐదు సూత్రాలను ఆచరణలో పెడితే అద్భుతాలు సాధించవచ్చు. అందుకు కావాల్సిందల్లా ప్రజల పక్షాన పోరాడడం. ఎన్నికలకు మరో రెండేళ్లు గడువు ఉంది. మహాళా రిజర్వేషన్లు కూడా వస్తున్నాయి. మహిళలను, బడుగు బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తే కవిత తప్పకుండా విజయం సాధిస్తారు. రాజకీయ పార్టీగా ముందు నిలబడతారు. అవినీతి లేకుండా సాగుతారన్న నమ్మకం కూడా ముఖ్యం. అందుకు వీరిందరినీ కలుపుకుని పోవడంతో పాటు, గుంటనక్కలను ఎదుర్కొనే చాణక్యం కూడా ముఖ్యం.



# ఉద్యమకారుల పక్షాన కవిత గళం

# రాజకీయ సమీకరణాల్లో మార్పు సంకేతం

## ఆత్మగౌరవం, సంక్షేమం, న్యాయం: కవిత త్రిముఖ వ్యూహం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు ఒక సరికొత్త పరిణామం ఆవిష్కృతమైంది. స్వరాష్ట్ర సాధనే లక్ష్యం గా ఆనాడు ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమ కెరటం, నేడు రాజకీయ అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న వేళ, కల్వకుంట్ల కవిత చేసిన ప్రకటన రాష్ట్ర వ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టించింది. 'తెలంగాణ రాష్ట్ర సేన' (టిఆర్ఎస్) అనే సరికొత్త రాజకీయ గొంతుకను వినిపించడమే కాకుండా, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన నాటి టీఆర్ఎస్ పంథాకు భిన్నంగా, ఉద్యమ ఆత్మను తిరిగి పునరుద్ధరించాలనే సంకల్పాన్ని ఆమె ప్రకటించారు. ఇది కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావ ప్రకటన మాత్రమే కాదు, తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని మళ్ళీ పట్టాలెక్కించే ఒక చారిత్రక ప్రయత్నంగా కనిపిస్తోంది. ఒకప్పుడు మడమ తిప్పని పోరాట పటిమతో, నీళ్లు, నిధులు, నియామకాలే ప్రాతిపదికగా సాగిన తెలంగాణ ఉద్యమం, అధికార ప్రాప్తి తర్వాత తన అసలైన లక్ష్యాలను విస్మరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, "మారిన కేసీఆర్... ఒక మరమనిషి" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పోషించిన పాత్ర అద్వితీయమైనది, అనన్యసామాన్యమైనది. అయితే, 2014 తర్వాత అధికార పీఠం దక్కిన క్రమంలో, ఉద్యమ నాయకత్వం ప్రజా బాహుళ్యానికి దూరమైందనే అసంతృప్తి జనబాహుళ్యంలో బలంగా నాటుకు పోయింది. ప్రగతి భవన్ గోడల మధ్య బందీ అయిన నాయకత్వం, సామాన్య తెలంగాణ బిడ్డల కష్టాలను, కన్నీళ్లను విస్మరించిందనే ఆవేదనను కవిత తన ప్రసంగంలో నిక్కచ్చిగా వ్యక్తం చేశారు. ఉద్యమ రథం దారి తప్పిందని, లక్ష్యం చేరకముందే విశ్రాంతి తీసుకుంటోందని ఆమె విశ్లేషించడం ఒక రకంగా తన సొంత రాజకీయ మూలాలను తానే ప్రశ్నించు కోవడమే.

ఒకనాడు ఉద్యమ వేడిని నిరంతరం రగిలించిన తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా మహిళలను ఏకం చేసిన కవిత, ఇప్పుడు అదే శక్తితో రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలని భావిస్తున్నారు. బతుకమ్మను కేవలం ఒక పండుగగా కాకుండా, అది తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మ గౌరవానికి ప్రతీకగా ప్రపంచ వ్యాప్తం చేయడంలో ఆమె చూపిన చొరవ అమోఘం. సంస్కృతి ద్వారా రాజకీయ చైతన్యం తేవడం అనేది తెలంగాణలో ఎప్పుడూ ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉంటూ వచ్చింది.

కవిత తన విశ్లేషణలో నేటి తెలంగాణ ఎదుర్కొంటున్న ఐదు ప్రధాన సవాళ్లను ప్రస్తావిస్తూ, వాటికి పరిష్కారంగా ఐదు కీలక హామీలను ప్రకటించారు. మొదటిది, నిరుద్యోగ భృతి మరియు ఉద్యోగ కల్పన. రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం వస్తుందని ఆశించిన యువత నేడు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ వయసు దాటిపోతున్న దుస్థితిలో ఉన్నారు. గణాంకాల ప్రకారం, లక్షలాది మంది నిరుద్యోగులు నేడు గ్రూప్స్, పోలీస్ రిక్రూట్‌మెంట్ వంటి పరీక్షల చుట్టూ తిరుగుతున్నారు. రెండవది, వ్యవసాయ రంగం. రైతు బంధు వంటి పథకాలు ఉన్నప్పటికీ, కౌలు రైతుల సమస్యలు, పంట గిట్టుబాటు ధరల విషయంలో ఉన్న లోపాలను ఆమె ఎత్తిచూపారు. మూడవది, మహిళా స్వయంశక్తి. కేవలం సంక్షేమ పథకాలకు పరిమితం చేయకుండా, మహిళలను ఆర్థికంగా నిలబెట్టే ప్రణాళికను ఆమె ముందుంచారు. నాలుగవది, విద్య మరియు ఆరోగ్యంలో సమూల మార్పులు. కార్పొరేట్ విద్యా వ్యవస్థ కోరల్లో చిక్కుకున్న సామాన్యుడికి నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనేది ఆమె లక్ష్యం. ఐదవది, సామాజిక న్యాయం. రాజకీయ అధికారంలో వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం దక్కడం లేదన్న సత్యాన్ని ఆమె అంగీకరించారు.

ముఖ్యంగా, తెలంగాణ ఉద్యమకారుల పట్ల కవిత చూపిన ఆవేదన చర్చనీయాంశమైంది. స్వరాష్ట్రం కోసం జైలుపాలైన వారు, లాఠీ దెబ్బలు తిన్న వారు నేడు అధికారానికి ఆమడ దూరంలో ఉండిపోగా, ఉద్యమ వ్యతిరేకులు కీలక పదవుల్లో కూర్చున్నారనే వాస్తవాన్ని ఆమె బహిర్గతం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారి కుటుంబాలను ఆదుకోవడం ప్రాథమిక బాధ్యతగా ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ మరియు ప్రస్తుత బీఆర్ఎస్ లు కేవలం తమ సొంత ఎజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని, అభివృద్ధిని విస్మరించి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆమె ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తన పాత పద్ధతులను వీడటం లేదని, బీజేపీ కేవలం భావోద్వేగాలను రెచ్చ గొడుతోందని, బీఆర్ఎస్ ప్రజాక్షేత్రం నుండి దూరమైందని ఆమె విశ్లేషించారు.

తెలంగాణ సమాజం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉంది. అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు కాదని, సామాన్యుడి బతుకు చిత్రంలో మార్పు రావడమేనని కవిత నమ్ముతున్నారు. గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమిత మైందా? అనే ప్రశ్నను ఆమె ప్రజల ముందుంచారు. గ్రామీణ తెలంగాణలో నేటికీ తాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలు, విద్యా సౌకర్యాల లేమి వంటివి ప్రజలను వేధిస్తున్నాయి. వీటన్నిం టికీ పరిష్కారం కావాలంటే, మళ్ళీ ఆనాడు ఉద్యమం సమయంలో ఉన్న పట్టుదల, చిత్తశుద్ధి అవసరమని ఆమె ఉద్ఘాటించారు. రాజకీయా ల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమేనని, కానీ ప్రజల మన్ననలు పొందాలంటే మాత్రం మట్టి వాసన తెలిసిన నాయకత్వ మే కావాలని కవిత ఈ ప్రసంగం ద్వారా నిరూపించే ప్రయత్నం చేశారు. సంస్కృతిని రాజకీయాల్లోకి తీసుకు రావడం ద్వారా తెలంగాణ గడ్డపై మళ్ళీ కొత్త ఊపిరి పోయాలని ఆమె ఆశిస్తు న్నారు. తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా ఆమె చేసిన సామాజిక సేవలు, బతుకమ్మ ప్రచారం ఆమెకు మహిళల్లో ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఆ పునాదులపైనే ఇప్పుడు ఆమె తన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలని చూస్తున్నారు. తన తండ్రి రూపొందించిన రాజకీయ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడం ద్వారా, తాను ప్రజల పక్షాన నిలబడతానని ఆమె సంకేతాలిచ్చారు. ఇది ఒక సాహసోపేతమైన నిర్ణయమే అయినప్పటికీ, తెలంగాణ రాజకీయాల్లో ఇది తప్పనిసరిగా ఒక గుణాత్మక మార్పుకు నాంది పలుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'తెలంగాణ రాష్ట్ర సేన' కేవలం ఒక రాజకీయ ప్రత్యామ్నాయం మాత్రమే కాదు, అది తెలంగాణ ఆత్మగౌరవ ప్రకటన. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ఉద్యమ రథం దారి తప్పినప్పుడు, మళ్ళీ దానిని సరైన మార్గంలోకి తీసుకు రావడానికి ఎవరైనా ముందుకు రావచ్చు. ఆ బాధ్యతను కవిత భుజానికెత్తుకున్నారు. ఈ ప్రయాణంలో ఆమె ఎదుర్కొనే సవాళు అనేకం ఉండవచ్చు. కానీ, ఆమె ఎంచుకున్న మార్గం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటే, తప్పకుండా రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇది ఒక సువర్ణ అధ్యాయంగా మారుతుంది. ఉద్యమ ఆత్మను తిరిగి పునరుద్ధరించాలనే ఆమె సంకల్పం ఎంతవరకు ఫలిస్తుందో, తెలంగాణ బిడ్డలు ఆమెను ఎలా ఆదరిస్తారో వేచి చూడాల్సిందే. అయితే, ఆమె ప్రసంగం మాత్రం నిద్రపోతున్న తెలంగాణ సమాజాన్ని మళ్ళీ మేల్కొలిపింది. రాజకీయ విశ్లేషణల ప్రకారం, ఈ మార్పు రాబోయే రోజుల్లో రాష్ట్రంలో సరికొత్త సమీకరణాలకు దారితీస్తుంది. సంక్షేమం, సామాజిక న్యాయం, మరియు ఆత్మగౌరవం అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్న కవిత, తెలంగాణ రాజకీయాల్లో ధ్రువతారగా నిలుస్తారా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది. ఏదేమైనా, ఈ ప్రసంగం ఒక రాజకీయ ప్రకటన కంటే ఎక్కువగా, ఒక ఉద్యమ పునరుద్ధరణ పిలుపులా వినిపించింది. అది తెలంగాణ నేల మీద మరో చారిత్రక ఘట్టానికి నాంది పలికింది.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# టిఆర్ఎస్ ఆవిర్భావంతో బిఆర్ఎస్‌కు షాక్

## తమ బ్రాండ్ పోవడంతో నేతల్లో ఆందోళన


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ఆవిష్కరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగ్‌లో కవిత తన కొత్త పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా అంటే టిఆర్ఎస్‌గా ప్రకటించారు. పార్టీ పేరు బిఆర్ఎస్‌కు షాక్‌కు గురి చేసింది. శనివారం ఉదయం కవిత సర్వ మత ప్రార్థనలు చేశారు. బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ర్యాలీగా బయల్దేరారు. గన్‌పార్కులో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటించారు. అనంతరం.. పార్టీ జెండా విష్కరించారు. ఈ పార్టీ పేరు బీఆర్ఎస్‌ను బిగ్ షాక్‌కు గురి చేసింది. ఇదిలా ఉండగా.. పార్టీ ప్రకటించే సభా ప్రాంగణాన్ని తెలంగాణ కలలు ఉట్టిపడేలా డిజైన్ చేయడం ఆకట్టుకుంది. వరంగల్ కాకతీయ కళా తోరణం ఆకృతిలో ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు ఫులే, ఆచార్య జయశంకర్ విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. ద్వారానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు. బిఆర్ఎస్‌ను మళ్లీ టిఆర్ఎస్‌గా మార్చే ఆలోచన ఉందని ఇటీవలే ఓ సందర్భంలో కెటిఆర్ అన్నారు. ఇప్పుడు టిఆర్ఎస్ ఆవిర్భావంతో వారికి షాక్ తగిలినట్లు అయ్యింది. అంతేగాకుండా తండ్రిని, అన్నను ఆమె టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ఫాంహౌస్ వీడి కేసీఆర్ బయటకు రాకపోవడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నా. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. ప్రజల కోసం కొట్లాడాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎక్కడ?. అధికారం వచ్చాక ఆయన మమకారం కోల్పోయారు. మారిన మరబొమ్మ కేసీఆర్. మాటల మనిషి, మర మనిషి, మారిన మనిషి కేసీఆర్. ఎక్కడ కష్టం వచ్చినా ఆ సారు రారు. గుంట నక్కల, తోడేళ్ల చేతిలో బందీ అయిన మనిషి. అదే మన కేసీఆర్ అయితే పాలమూరు దగ్గర కుర్చీ వేసుకుని మరీ పనులు పూర్తి చేసేవారు. కేసీఆర్ మారతారేమో అని చూశా. ఇళ్లు, భూములు అమ్ముకుని రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను ఏం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మీద కర్రలతో దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చారు. ఉద్యమకారులకి మర్యాద ఇచ్చారా?. కేసీఆర్ మారిపోయారు కాబట్టే నేను యుద్ధం చేస్తున్నా. మనకు ప్రాణాలు అడ్డంపెట్టి పోరాడే సైన్యం కావాలి. నేను ఏం తప్పు చేశానని నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కాళేశ్వరం మీద మాట్లాడితే సస్పెండ్ చేస్తారా?. అవినీతి చేసిన పందికొక్కులని కేసీఆర్ పక్కన పెట్టుకున్నారు అంటూ విమర్శలు గుప్పించారు.

# కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

**- తెలంగాణలో వచ్చిదే బిజపియే**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25 : కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.



# ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దు

**-రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

**-ఎండి అంజాద్ పాషా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 25 : ములుగు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ములుగు జిల్లా కార్యదర్శి ఎండి అంజద్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని కాసిందేవి పేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం రాష్ట్ర రైతు సంఘం బృందం పరిశీలించడం జరిగింది. గత 20 రోజులుగా సెంటర్లలో ధాన్యాన్ని ఆరబోయడం, రైతులు చేయడం జరిగిందని రైతుల వద్ద ప్రభుత్వం ఒక గింజ కూడా కొనుగోలు చేయలేదని 14శాతం తేమశాతం ఉన్నదని, పరిశీలన అనంతరం స్థానిక సెంటర్ ముందు మెయిన్ రోడ్డు పైన రైతులు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగింది. ఈ రాస్తారోకో నిరసన ఉద్దేశించి ఎండి అంజాద్ పాషా మాట్లాడుతూ ములుగు మండలంలోని రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగా రైతులు అనేక ఇబ్బందులతోని వ్యాపారస్తుల చుట్టూ తిరుగుతున్నారు అన్నారు. ప్రభుత్వం సెంటర్ యజమాన్యాలు రైతుల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ములుగు జిల్లా అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. కొనుగోలు చేయనిచో ప్రభుత్వ కార్యాలయాల ముందు ములుగు మండల రైతాంగం సమీకరించి ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండి రహీం పాషా,కట్ల లింగస్వామి,ఎండి అబ్దుల్ నాభి, గొర్రెకుంటా హుస్సేన్,రాజయ్య, మధ్యల రితేష్,మర్రి శ్రీను,ఎండి నాసర్ హసీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కారణాల వల్లే ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణి

## - ఏబీకేఎంఎస్-బీఎంఎస్ నాయకులు - 12వ వేతన ఒప్పందం కోసం దశలవారీ ఆందోళనలకు సిద్ధం కావాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25:సింగరేణి సంస్థ రాజకీయ కారణాల వల్లే ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని, రూ.53 వేల కోట్ల బకాయిల వసూళ్లలో గుర్తింపు సంఘాలు విఫలమయ్యాయని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) నాయకులు విమర్శించారు. భద్రాద్రి జిల్లా మణుగూరు ఏరియా పీకే ఓసీ-4లో బీఎంఎస్ పిట్ సెక్రటరీ రాంబాబు అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్, ఏరియా ఉపాధ్యక్షుడు భూక్య కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.మాధవ నాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుదోవ విధానాలు, అధిక రాజకీయ జోక్యం కారణంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆర్థికంగా బలహీనపడిందని ఆరోపించారు. డిసెంబర్ 2025 నాటికి సింగరేణికి రావలసిన సుమారు రూ.53 వేల కోట్ల బకాయిలను తెలంగాణ ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి వసూలు చేయడంలో గుర్తింపు సంఘాలు అయిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ విఫలమయ్యాయని విమర్శించారు. దీని వల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా కొనసాగిన ఏఐటీయూసీ తమ పదవీకాలంలో కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలమైందని, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని తెలిపారు. గుర్తింపు కాలం ముగిసిన తర్వాత ఆందోళనలు చేపట్టడం శోచనీయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సొంతింటి పథకం, పెర్క్స్ పై ఇన్కమ్ ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్, క్యాడర్ స్కీమ్‌ల అమలులో కూడా ఈ సంఘాలు విఫలమయ్యాయని విమర్శించారు. కొత్త గనుల కేటాయింపులో రాజకీయ కారణాలతో సింగరేణికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో గనులు రాకుండా అడ్డుకున్న సంఘాలే ఇప్పుడు వేలం ద్వారా గనులు సాధించాలని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధించలేకపోవడానికి ఈ సంఘాలు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాజకీయాలకు అతీతంగా సింగరేణి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. మణుగూరు పీకే ఓసీ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికి కేటాయించేలా బీఎంఎస్ కృషి చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన ఒప్పందం ఈ ఏడాది జూన్ 30తో ముగియనుండగా, జూలై 1 నుంచి అమల్లోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించాలని బీఎంఎస్ నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్ర బొగ్గు మంత్రి కిషన్ రెడ్డికి కూడా జేబీసీసీఐ ఏర్పాటు చేయాలని ఏబీకేఎంఎస్ ద్వారా లేఖ పంపినట్లు వెల్లడించారు. 12వ వేతన ఒప్పంద సాధన కోసం చేపట్టే ఆందోళనల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భూక్య కిషన్, మొగిలిపాక రవి, రంజిత్, రాంబాబు, శివకుమార్, అల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ఫ్ ఎన్యుమరేషన్ సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

## జనగణన ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొనాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25:జనగణన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంపై శనివారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంప్రదాయ విధానంలో ఇంటింటికీ వచ్చే గణన అధికారుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా, ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆన్‌లైన్ ద్వారా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ విధానం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు ఖచ్చితమైన సమాచారాన్ని అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, ఆస్తులు, గృహ సౌకర్యాలు వంటి కీలక సమాచారాన్ని ప్రజలు స్వయంగా నమోదు చేయడం వల్ల తప్పులు దొర్లే అవకాశం తగ్గుతుందని చెప్పారు. వ్యక్తిగత సమాచారాన్ని నేరుగా అధికారిక వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేయడం వల్ల గోప్యత మరింత భద్రంగా ఉంటుందని వివరించారు. నమోదు ప్రక్రియను వివరిస్తూ ప్రభుత్వం ప్రకటించిన అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ నంబర్ లేదా ఆధార్ నంబర్‌తో లాగిన్ అవ్వాలని సూచించారు. అనంతరం తెలుగు లేదా అనుకూలమైన భాషను ఎంపిక చేసుకుని, మ్యాప్‌లో నివాసాన్ని జియో-ట్యాగ్ చేసి, గృహం మరియు




కుటుంబానికి సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలన్నారు. వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేసిన తర్వాత మొబైల్‌కు వచ్చే ఎస్ఈఐడీని భద్రపరచుకుని, ఇంటింటి సర్వేకు వచ్చే గణాంక సిబ్బందికి చూపించాలని సూచించారు. ప్రతి కుటుంబం ఒక మొబైల్ నంబర్‌ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందని, ఈ సేవ పూర్తిగా ఉచితమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గణాంక సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. జనగణన దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియగా పేర్కొంటూ, ప్రజలు అందించే ఖచ్చితమైన సమాచారం ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించబడతాయని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీపీఓ సంజీవరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పిరేషనల్ జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష

## కీలక సూచనలు చేసిన సెంట్రల్ ప్రభారి ఆఫీసర్ డాక్టర్ సాయిబాబు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25:ఆస్పిరేషనల్ జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధి కార్యక్రమాల అమలు, పురోగతి, సమస్యలు మరియు పరిష్కార మార్గాలపై మినిస్ట్రీ ఆఫ్ పవర్ అదనపు కార్యదర్శి, సెంట్రల్ ప్రభారి ఆఫీసర్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా నోడల్ అధికారి లోకేష్, సీపీఓ సంజీవరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా, సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సమీక్షించారు. డిజిటల్ కనెక్టివిటీ పెంపు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవల అందుబాటు మెరుగుపడుతుందని, విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సాంకేతిక వినియోగం పెరగడం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించవచ్చని తెలిపారు. ఆరోగ్య శాఖ పరిధిలో గర్భిణీ స్త్రీలకు సమగ్ర ఆరోగ్య సేవలు, అనీమియా నివారణ, మాతా-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పదార్థాల సరఫరా, చిన్నారుల ఆరోగ్య స్థితి మెరుగుదలపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. విద్యాశాఖ పరిధిలో పదో తరగతి పరీక్ష ఫలితాలు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం, డ్రాప్ అవుట్ తగ్గింపు, విద్యార్థుల హాజరు పెంపు వంటి అంశాలపై చర్చించారు. పాఠశాల స్థాయిలో నాణ్యమైన బోధన, మౌలిక వసతులు, డిజిటల్ విద్యా వనరుల వినియోగం ద్వారా ఫలితాలు మెరుగుపరచాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులకు సాంకేతిక సహాయం, పంటల దిగుబడుల పెంపు, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి సారించారు. విద్యుత్ కనెక్షన్లు, గృహ నిర్మాణం, రోడ్లు, త్రాగునీటి సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై కూడా పురోగతిని సమీక్షించారు. డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ, ఆస్పిరేషనల్ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా డేటా ఆధారితంగా ఉండాలని, ప్రతి సూచికలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జిల్లాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన జిల్లాకు రూ.10 కోట్లు, రెండో స్థానానికి రూ.5 కోట్లు, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన జిల్లాలకు రూ.3 కోట్లు చొప్పున మొత్తం రూ.30 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులు అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మండలాలకు రూ.20 కోట్ల ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా ప్రతి సంవత్సరం రూ.350 కోట్లు మంజూరు అవుతున్నాయని, ఈ నిధులను ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, డిజిటల్ కనెక్టివిటీ బలోపేతానికి వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి సూచికలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ స్థాయిలో సేవల చేరికను పెంచుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన లక్ష్యాలను సమయపాలనతో పూర్తి చేసి, డేటాను నిరంతరం ఆన్‌లైన్ పోర్టల్‌లలో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి స్వర్ణలత లెనినా, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఆస్పిరేషన్ బ్లాక్ ఫెలో నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సరఫరాపై హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

## నాలుగు రోజుల్లో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి - అధికారులకు ఆదేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25:వేసవికాలంలో త్రాగునీటి కొరత సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన జూమ్ సమావేశం ద్వారా భద్రాచలం పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలెక్టర్ త్రాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో త్రాగునీటి సరఫరా పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదేనని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి గ్రామానికి నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామంలో బోర్‌వెల్లు, చేతి పంపులు వంటి ప్రత్యామ్నాయ వనరులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. మోటార్లలో లోపాలు తలెత్తినపుడు తక్షణమే మరమ్మతులు చేయడానికి అదనపు మోటార్లు, జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవో, ఎంఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో చివరి దూర ప్రాంతాలకు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే గరిష్టంగా 24 గంటల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు ప్రతి వార్డులో ఉదయం నీటి సరఫరా సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండలాల వారీగా త్రాగునీటి సమస్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో గుత్తికొయ హ్యాబిటేషన్లలో సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించి, వాటి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాల్వంచలో 55, చర్లలో 54, దుమ్ముగూడెంలో 55 త్రాగునీటి సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణలో వాటిని ఎందుకు పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారా? ఇంకా పనులు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేస్తూ, నాలుగు రోజుల్లోపే అన్ని త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలని గట్టిగా ఆదేశించారు.



# పాల్వంచలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 25:భద్రాద్రి జిల్లా పాల్వంచలోని శ్రీనివాస కాలనీలో శ్రీనివాసగిరిపై వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎండను సైతం లెక్కచేయకుండా పాదాల మండపం వద్ద నుంచి గుట్టపై వరకు మెట్ల పూజ చేస్తూ సుమారు 1600 మెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, అర్చకులు ఆరుట్ల ఫణిరాజాచార్యులు వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వర్లు, భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఊకే భద్రయ్య, కార్యదర్శి తాటికొండ శ్రీలత, సేవాదళ్ అధ్యక్షుడు కొండ్రు శివ, కార్యదర్శి పరిశిక కిరణ్, మహిళా సంఘం అధ్యక్షురాలు నిడమనేని అనూష, కార్యదర్శి రేనాటి స్రవంతి, భక్త సమాజ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ఆగమైపోతుంది

## - కపిలవాయి దిలీప్ కుమార్


## - ఖమ్మంలో రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 25:కొట్లాడి సాధించుకున్న తెలంగాణ నేడు ఆగమైపోతుందని, కేసీఆర్ కుటుంబ పాలనతో రాష్ట్రం కబంధహస్తాల్లో చిక్కుకుందని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ విమర్శించారు. అటువంటి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో తాను చురుకైన పాత్ర పోషించానని, కేసీఆర్‌తో కలిసి చేసిన ఉద్యమాలు రాష్ట్రంలో ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయని గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అయ్యారని, ఉద్యమ సమయంలో దళితుడే ముఖ్యమంత్రి అని ప్రకటించిన ఆయన ఆ మాట నిలబెట్టుకోకుండా తానే ముఖ్యమంత్రిగా కొనసాగి కుటుంబ పాలన నడిపారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందకుండా ఆగమైపోయిందని ఆరోపించారు. ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యం పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలన ప్రజాభీష్టం మేరకు సాగాలని సూచించారు. ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే ఏ ప్రభుత్వం అయినా ఎల్లకాలం కొనసాగలేదని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలను తమ పార్టీ నిశితంగా పరిశీలిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీని ఆదరించి మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బీరప్ప, కోశాధికారి కె. గిరీష్, యూత్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ విక్రమ్ శర్మ, సూర్యాపేట అధ్యక్షులు డాక్టర్ సోమగాని నరేందర్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు జానీ మహమ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర చారి, స్టేట్ సెక్రటరీ ఎన్.భాస్కరరావు, జనరల్ సెక్రటరీలు సుధాకర్ యాదవ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడే టేకులపల్లి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు

(ప్రజాలక్ష్యం విలేఖరి)



టేకులపల్లి, ఏప్రిల్ 25:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి 333వ ఆరాధన మహోత్సవాలు ఏప్రిల్ 26 ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా స్వామివారి ఆరాధన మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఇదే రోజున బ్రహ్మంగారు జీవ సమాధి పొందిన సందర్భంగా ఈ ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలో కూడా ఈ ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదే తరహాలో టేకులపల్లి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తులకు ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# చింతలచెర్వు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి - కొత్వాల

## రైతులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని పాత పాల్వంచ చింతలచెర్వు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధికారులను కోరారు. పట్టణ పరిధిలోని పాత పాల్వంచ చింతలచెర్వు కట్టపై రూ.10 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం తహసీల్దార్ దారా ప్రసాద్, ఇరిగేషన్ డివిజనల్ ఇంజినీర్ ఎం. రాణి, అసిస్టెంట్ ఇంజినీర్ గురువేష్, పట్టణ పోలీస్ ఎస్ఐ నాగరాజు, రెవెన్యూ టౌన్ ఆర్ఐ రవి తదితర అధికారులు చెరువు ఆయకట్టు రైతులు, గృహ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు ప్రారంభమై సుమారు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇంకా అసంపూర్ణంగానే మిగిలిపోయాయని అన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వారిపై అదిలాబాద్ పోలీసుల ఉక్కుపాదం

## - జిల్లాలో నకిలీ విత్తనాల రాకెట్ బట్టబయలు - 150 ప్యాకెట్లు, రూ.60 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఏప్రిల్ 25:జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయంపై అదిలాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. బేల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న రాకెట్‌ను ఛేదించి, 150 నకిలీ విత్తనాల ప్యాకెట్లు, రూ. 60 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బేల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం ఆధారంగా సాంగిడి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే బేల పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విత్తనాలు నకిలీవా కాదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు వ్యవసాయ శాఖ అధికారిని సంఘటనా స్థలానికి పిలిపించి పరిశీలించగా అవి నకిలీవేనని తేలింది. దర్యాప్తులో జిట్టావార్ కిషోర్ రెడ్డి అనే వ్యక్తి గుజరాత్‌కు చెందిన "నరేష్ క్రాప్ సైన్స్" కంపెనీలో కమిషన్ ఏజెంట్‌గా పనిచేస్తూ, అదే కంపెనీకి చెందిన ధర్మేష్ కచ్చడియాతో కలిసి కుట్ర పన్ని "మౌలి-555" అసలు పత్తి విత్తనాల పేరును పోలి ఉండేలా "మౌలి-5" పేరుతో నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గత రెండు నెలలుగా గుజరాత్ నుంచి నవత ట్రాన్స్‌పోర్ట్ ద్వారా సుమారు 4,500 నకిలీ విత్తనాల ప్యాకెట్లు తెప్పించి, అందులో 4,000 ప్యాకెట్లను మహారాష్ట్రలో రక్తావర్ పవన్ ద్వారా, మరో 350 ప్యాకెట్లను నవగరే కునాల్, కుల్దీప్ టాడ్రె ద్వారా రైతులకు అసలైన విత్తనాలుగా నమ్మించి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. సంఘటనా స్థలంలో మిగిలిన 150 ప్యాకెట్లను స్వాధీనం చేసుకోగా, విక్రయాల ద్వారా వచ్చిన రూ. 60,000 నగదు, రియల్‌మీ, ఒప్పో, వివో, రెడ్మీ మొబైల్ ఫోన్లు, టీఎస్--01 ఈకే--5044 నంబర్ గల హోండా షైన్ ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్యాకెట్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ, పరీక్ష తేదీ, గడువు, ఎమ్మార్పీ వంటి తప్పనిసరి వివరాలు లేకపోవడం గమనించారు. రెండు ప్యాకెట్లను నమూనాలుగా సేకరించి పరీక్షకు పంపగా, మిగతా వాటిని సీజ్ చేశారు. కాగా ఈ కేసులో సాంగిడి గ్రామం, బేలా మండలానికి చెందిన జిట్టావార్ కిషోర్ రెడ్డిని, ఝరి జామ్ని గ్రామం, మహారాష్ట్రకు చెందిన రక్తావర్ పవన్ ను, సాంగిడి గ్రామంకు చెందిన నవగరే కునాల్ ను, మణియార్పూర్ గ్రామానికి కుల్దీప్ టాడ్రె లను పోలీసులు అదుపులోకి తీసుకోగా, గుజరాత్ కు చెందిన ధర్మేష్ కచ్చడియా పరారీకిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 94/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 316, 336, 61 ఆర్/డబ్ల్యూ 3(5)తో పాటు సీడ్స్ యాక్ట్ 1966 సెక్షన్ 7 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ



కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన బేల సబ్‌ఇన్‌స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

**రైతులకు సూచనలు:**విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని, ప్యాకెట్లపై కంపెనీ పేరు, తయారీ తేదీ, గడువు, ఎమ్మార్పీ వంటి వివరాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని డీఎస్పీ సూచించారు. అనుమానాస్పద విత్తనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, నకిలీ విత్తనాల వల్ల రైతులకు భారీ నష్టం కలుగుతుందని జాగ్రత్తగా ఉండాలని కోరారు.



# కొత్తగూడెంలో స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్

## ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 25:విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడా శిక్షణ శిబిరాల్లో చురుకుగా పాల్గొనాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రజా పాలన సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షిక సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరాన్ని శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సీఈఆర్ క్లబ్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థ అందించిన సీఎస్ఆర్ నిధులు రూ. 20 లక్షలతో అథ్లెటిక్స్, టైక్వాండో, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు అవసరమైన సామగ్రిని సమకూర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంప్‌లలో శిక్షణ అందిస్తున్న కోచ్‌లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా సామగ్రిని అందజేశారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థినుల్లో నైపుణ్యాల వెలికితీత

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఏప్రిల్ 25: విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉత్తమ వేదికలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎం.జె.పి బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల విద్యార్థినుల కోసం 15 రోజుల పాటు నిర్వహిస్తున్న 'ఆర్ట్ అండ్ స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్--2026'ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థినుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. స్వచ్ఛందంగా ఈ శిబిరానికి హాజరైన సుమారు 400 మంది విద్యార్థినులను అభినందించారు. చదువుతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, వేద గణితం, వ్యక్తిత్వ వికాసం, క్రీడల్లో శిక్షణ పొందడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎం.జె.పి పాఠశాలలు సాధించిన ఉత్తమ ఫలితాలను ప్రశంసించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యార్థినిని ఉదాహరణగా చూపిస్తూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌష్టికాహారం, ఇతర అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలలో అవసరమైన అత్యవసర మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ శ్రీధర్, డీపీఎం శోభారాణి, ప్రిన్సిపాల్ కీర్తి, డీఈ సమ్మిరెడ్డి, సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 252 జీ ఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

## ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25:జిల్లాలో 252 జి ఓ ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరం లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సమావేశానికి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 సవత్సరము నకు గాను కమిటి ఆద్వర్యంలో మొదటి విడతలో 94 నూతన అక్రిడిటేషన్ కార్డులు మంజూరి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారి నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డు కొరకు ధరఖాస్తు చేసుకున్నవారు 252 జి ఓ లో పేర్కొన్న అవసరమైన దృవ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ ఎస్ సంపత్ కుమార్ , జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రహమాన్, రవి నాయక్, తుకారాం, సంతోష్, ప్రకాష్ గౌడ్, చందు, ఆబిద్ అహ్మద్, వినయ్ కుమార్, బి రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఏప్రిల్ 25:వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి మే 30 వరకు ప్రతిరోజూ సాయంత్రం 4:30 గంటల నుంచి 7:30 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కూచిపూడి, జానపద నృత్యం, చిత్రలేఖనం, సంగీతం (లలిత, కర్ణాటక, హిందూస్థానీ), వాయిద్య పరికరాలు (తబల, హార్మోనియం, పియానో), కుట్లు--అల్లికలు, మెహందీ వంటి విభిన్న అంశాలపై ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 5 నుంచి 16 సంవత్సరాల లోపు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం గత ఏడాది అక్టోబర్ 5న చెన్నైలోని సివెట్ కళాశాల మైదానంలో వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే విన్యాసాల్లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాస్టర్లు మిట్టు దత్తు, గాజుల జగన్నాథ్ రుషి పాల్గొని 45 నిమిషాల పాటు నిరంతరాయంగా పంచ్‌లు కురిపించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించినందుకు గాను గిన్నిస్ బుక్ మెమెంటోను కలెక్టర్ వారికి అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి గణేష్ జాదవ్, బాలకేంద్రం ప్రతినిధులు మెట్టు రవి, ఇతర ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో గణనీయమైన పురోగతి సాధించాలి

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆదిలాబాద్, ఏప్రిల్ 25: ఇంటర్మీడియట్ ఫలితాల్లో గణనీయమైన పురోగతి సాధించి, గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లతో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, గత పరీక్షల ఫలితాలు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత పరీక్షల ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫలితాల్లో స్పష్టమైన మెరుగుదల కనిపించాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతి కళాశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ముఖ్యంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం కళాశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక వ్యూహాలను రూపొందించాలని ఆదేశించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్న పరిస్థితిని గుర్తించి, ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా



పరీక్ష ఫీజు చెల్లించి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యాబోధనను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్యానెల్ బృందాలు క్రమం తప్పకుండా కళాశాలలను సందర్శించి బోధనా విధానం, విద్యార్థుల పురోగతి, పరీక్షా సన్నద్ధతపై పర్యవేక్షణ చేపడతాయని తెలిపారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి, పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 25:ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడాకారులు వేసవి శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థులకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడల శిక్షణ శిభిరాన్ని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవితో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా గిరిజన విద్యార్థుల కొరకు వేసవి క్రీడల శిక్షణ లో భాగంగా హ్యాండ్ బాల్, కబడ్డీ, అథ్లెటిక్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోని క్రీడలలో రానించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడ కారులకు క్రీడా



దుస్తులు షులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మదారి శేఖు, జి సి డి ఓ శకుంతల, ఎం సి ఓ ఉద్ధవ్, పాఠశాల హెచ్ ఎం సాయి బాభా , వ్యాయమ ఉపాద్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# చిన్నయ్య-పెద్దయ్య దేవుడి గుట్ట ముదిరాజు కులస్తులదే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, ఏప్రిల్ 25: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని చిన్నయ్య--పెద్దయ్య దేవుడి గుట్టపై సర్వహక్కులు ముదిరాజు కులస్తులకే చెందినవని, ఈ గుట్ట ముదిరాజు సమాజానికి చెందిన పవిత్ర స్థలమని ముదిరాజు కుల సభ్యులు స్పష్టం చేశారు. శనివారం గుట్ట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ముదిరాజు కులస్తులకు సమాచారం ఇవ్వకుండా గుట్టకు సంబంధించిన వార్తలు ప్రచారం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. గుట్టపై ఎటువంటి కార్యక్రమాలు, ప్రచారాలు చేపట్టాలన్నా ముందుగా ముదిరాజు కుల ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని కోరారు. త్వరలోనే గుట్టపై రైతుల పండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ సహకారంతో గుట్ట అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ముదిరాజు కులస్తులకు తెలియజేయకుండా గుట్ట గురించి పత్రికల్లో వార్తలు రావడంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు కుల సభ్యులు పంబాల భీమన్న, చొప్పరి గంగాధర్, జక్కుల చిన్న భీమేష్, పిట్టల భీమరాజం, పంబాల భీమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పెద్దల చిత్రపటాలకు పాలాభిషేకం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


నిర్మల్, నవంబర్ 25: ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరిక అయిన సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో నిర్మల్ ఆర్టీసీ డిపోలో కార్మికులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ జేఏసీ, యాజమాన్యం, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చల్లో ప్రభుత్వం 32 డిమాండ్లతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో నిర్మల్ డిపోలో కార్మికులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వంలో విలీనం ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, చర్చల్లో కుదిరిన ఒప్పందాలన్నింటినీ సకాలంలో అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రీజినల్ నాయకులు ఆర్. గంగాధర్, కే. రమేష్, రాజేశ్వర్‌తో పాటు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులపై కార్పొరేట్ హాస్పిటల్స్ ఆర్థిక దోపిడీ అరికట్టాలి

## యాజమాన్యానికి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ వినతి

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25:సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో మెరుగైన వైద్యం పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీని అరికట్టాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ యాజమాన్యాన్ని కోరింది. ఈ మేరకు సింగరేణి సంస్థ సిఎండికి ఆ సంఘం ప్రధాన కార్యదర్శి యతీపతి సారంగపాణి శనివారం వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలోని వివరాల ప్రకారం, ఏరియా హాస్పిటల్స్ మరియు మెయిన్ హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మంచిర్యాల్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఎంఓయు కలిగిన కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను మెరుగైన చికిత్స కోసం పంపుతున్నారని పేర్కొన్నారు. అయితే అక్కడ రోగులకు నాణ్యమైన వైద్యం అందించకుండా, వారి ఆరోగ్య పరిస్థితిని భయానకంగా చిత్రీకరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చికిత్సలో అవసరమైన మందులు, గ్లోవ్స్, శానిటేషన్ వస్తువులు తదితర మెడికల్ సామగ్రిని సరైన ప్రమాణాలతో అందించకుండా, నాసిరకమైన వస్తువులను నాణ్యమైనవిగా చూపిస్తూ ఉద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అదనంగా ఉద్యోగులపై ఆర్థిక భారం మోపే విధంగా అనుమతి పత్రాలు తీసుకుని, తరువాత వారి జీతాల నుంచి రికవరీ చేసే విధానాన్ని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ తీవ్రంగా ఖండించింది. ఉద్యోగులకు ఎలాంటి అదనపు రికవరీ లేకుండా పూర్తి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.



# 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సవరణకు పరిష్కారం చూపాలి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కోల్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగుల అసోషియేషన్ వినతి పత్రం

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 25:కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్ సవరణ, పదవీ విరమణ ప్రయోజనాల్లో సమానత్వం కల్పించాలని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్-1998 నిబంధనల ప్రకారం 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ సవరణను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ మేరకు మంత్రికి అసోషియేషన్ ప్రతినిధులు ప్రదీప్ కుమార్ ఘోషల్, సుధాంశు కుమార్ రాయ్ శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రంలో వారు పేర్కొన్న వివరాల ప్రకారం, 1998 మార్చి 31న అమలులోకి వచ్చిన కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్ (సిఎంపిఎఫ్-1998)లో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. 2024 మార్చి 8న కనీస పెన్షన్‌ను నెలకు రూ.1000కు సవరించినప్పటికీ, 2005కు ముందు పదవీ విరమణ చేసిన అనేక మంది ఉద్యోగులకు ఇప్పటికీ నెలకు రూ.2000 కంటే తక్కువ పెన్షన్ మాత్రమే అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక అవసరాలకు కూడా సరిపోని పరిస్థితి అని వారు పేర్కొన్నారు. డియర్నెస్ అలవెన్స్ (డిఏ) లేకుండా ఉన్న పెన్షన్ వ్యవస్థ అసంపూర్ణమని, పెన్షన్ అనేది హక్కు గానీ బోనస్ కాదని స్పష్టం చేశారు. కనీస పెన్షన్ మొత్తం జైలు ఖైదీలకు లభించే రోజువారీ ఆర్థిక సహాయం కంటే తక్కువగా ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే కోల్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ మరియు నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల మధ్య పదవీ విరమణ ప్రయోజనాల్లో తీవ్ర అసమానతలు ఉన్నాయని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు రెండు పెన్షన్లు, రూ.25 లక్షల వరకు వైద్య కవరేజ్, వార్షిక అలవెన్స్, అధిక గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు ఉండగా, నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు కేవలం ఒకే పెన్షన్, తక్కువ వైద్య కవరేజ్, అలవెన్స్ లేకపోవడం వంటి వివక్ష కొనసాగుతోందని విమర్శించారు. వైద్య సదుపాయాల్లో కూడా ఎగ్జిక్యూటివ్‌లకు మెరుగైన పథకాలు అమలవుతుండగా, నాన్-ఎగ్జిక్యూటివ్‌లు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు చందా చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. గ్రాట్యుటీ చెల్లింపుల్లో కూడా అసమానతలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిఎంపిఎఫ్-1998 పెన్షన్ మొత్తాన్ని పెంచడం, ఇతర ప్రభుత్వ సంస్థల మాదిరిగా డిఏతో అనుసంధానం చేయడం, ప్రతి మూడు ఏళ్లకు ఒకసారి పెన్షన్ ఫండ్ సమీక్ష నిర్వహించడం, కనీస పెన్షన్ పెంపు, సిపిఆర్ఎంఎస్-ఈ మరియు సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ మధ్య వివక్ష తొలగించడం, గ్రాట్యుటీ చెల్లింపుల్లో సమానత్వం తీసుకురావడం, అందరికీ ఒకే విధమైన పదవీ విరమణ ప్రయోజనాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రంపై ప్రదీప్ కుమార్ ఘోషల్, సుధాంశు కుమార్ రాయ్ సంతకాలు చేశారు.



# భూపాలపల్లిలో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

- పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక
- కిక్ బాక్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసి శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి )

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 25 :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక కిక్ బాక్సింగ్ హాలులో శుక్రవారం జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలంగాణా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీనివాస్ (మాదాసి) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, పోటీలలో 60 మంది విద్యార్థులు పాల్గొనగా కాండిడేట్, జూనియర్, సీనియర్ విభాగాలలో పలువురు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిలో అవిక అర్జున్, శ్రీ వైష్ణవి, నేహ, హరిణి, ఆరాధ్య, విధిష దేవి, సంజన శ్రీ, నిక్షిత, నవ్య, రిషిక రాజ్, రితిక రాజ్, విధ్విన్, గగన్ సాయి, ప్రజ్వాల్, ఆరుష్, లవణ్ కుమార్, నితిన్, రోషిత్, అఖిరానందన్, సాత్విక్ లు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 12 రోజులు ప్రత్యేక శిక్షణ ఇచ్చిమే 9, 10 తేదీలలో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎంపికలలో కిక్ బాక్సింగ్ కోచ్ లు అశోక్, నాగరాజు, రిషి పాల్గొన్నారు.

# 2030 నాటికి మలేరియా రహిత సమాజం నిర్మిద్దాం

## - వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ - ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డులో అవగాహన ర్యాలీ, సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని సులానగర్ ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం (ఏప్రిల్ 25) సందర్భంగా అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రాందాస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్య అధికారులు తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ నేతృత్వంలో ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులో ప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ, మలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకర వ్యాధి అని, ముఖ్యంగా వర్షాకాలం మరియు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే మలేరియాను పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. మలేరియా లక్షణాలలో జ్వరం, వణుకు, చెమటలు పట్టడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలు కనిపిస్తాయని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న వెంటనే స్థానిక వైద్య సిబ్బందిని లేదా సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి ఉచితంగా నిర్వహించే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల పెరుగుదలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. రాత్రి సమయంలో దోమతెరలు ఉపయోగించడం, పూర్తి చేతుల బట్టలు ధరించడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

ప్రభుత్వం మలేరియా నిర్మూలన కోసం పలు కార్యక్రమాలు చేపడుతోందని, “దోమలను నివారిద్దాం -- మలేరియాను తరిమికొడదాం” అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అవగాహన




పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారం ఉంటే ప్రభుత్వం నిర్దేశించిన 2030 నాటికి మలేరియా రహిత సమాజం నిర్మాణం కచ్చితంగా సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఇల్లందు సబ్ యూనిట్ అధికారి జాబిశెట్టి శ్రీనివాస్ రావు, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, మలేరియా నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు గుజ్జ విజయ, కౌసల్య సింగ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు చందన, శైలజ, హారిక, రుక్సానా, ధరణి, ఇంద్రజ, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, హెల్త్ అసిస్టెంట్ రమేష్ బాబు, సింగరేణి నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించాలి

- ఇళ్ల వద్ద మౌలిక వసతులు పూర్తి చేయాలి.
- లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చర్యలు చేపట్టాలి- జిల్లా కలెక్టర్ శ్రీహర్ష.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 25:రామగుండం (జంగాలపల్లి)లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం రామగుండం మండలంలోని జంగాలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి పరిశీలించి, అక్కడి మౌలిక వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్ద నీరు, విద్యుత్, రహదారులు తదితర ప్రాథమిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని స్పష్టం చేశారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి, పాములపేటలో ప్లాట్లు పొందిన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రామగుండం మండలంలోని న్యూ మారేడుపాకలో ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిశీలించి, ఆ భూములను రెవెన్యూ శాఖకు కేటాయించి, ఆర్ అండ్ ఆర్ పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో ఆర్డిఓ గంగయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రబీ వరి కొనుగోళ్లు వేగవంతం

## - రైతులకు చెల్లింపులు పూర్తి - అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, ఏప్రిల్ 25:ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 318 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా నేటి వరకు 739 మెట్రిక్ టన్నుల వరిని 105 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో దొడ్డు రకాలు 703 మెట్రిక్ టన్నులు, సన్న రకాలు 36 మెట్రిక్ టన్నులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధరగా సుమారు రూ. 0.02 కోట్ల విలువను రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి, వారు సకాలంలో బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలని, వడ్లను ఆలస్యం చేయకుండా మిల్లులకు తరలించాలని అధికారాలు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక ప్రతిరోజూ వరి కొనుగోలు కేంద్రాల పనితీరుపై సంబంధిత ఏజెన్సీల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, రైతులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు సహాయం అందించేందుకు జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం, కరీంనగర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను తెలియజేయడానికి ఫోన్ నెంబర్ 9154249727లో సంప్రదించవచ్చని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు, మిల్లర్లు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం కర్షకులకు అండ

## కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 25 :కర్షకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల నియోజక వర్గ పరిధిలోని మల్లాపూర్ మండలం వివిధ గ్రామాల్లో ఐకెపి ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల మల్లాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనతడుపుల పుష్పలత నర్సయ్య, మండల రెవెన్యూ అధికారి రామచందర్ లతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టింగుల పేరుతో రైతులను మోసం చేసిందని కానీ నేడు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల పక్షపాతిగా నిలుస్తూ ఎలాంటి కట్టింగులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు జరిగేలా చూస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఆదుకుంటూ తూకం విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా ఊరుకోబోమని అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, పాత, కొత్త దామ్రాజ్ పల్లి, నడికుడా, రాఘవపేట, ముత్యంపేట, సాతారం, గుండంపల్లి, చిట్టాపూర్, సిరిపూర్, ముస్తాపూర్, రత్నాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వనతడుపుల పుష్పలత నర్సయ్య, మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు జలపతి రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి రాజోజి సదానంద చారి, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు, ఐకెపి ప్యాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపును ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్

## జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ‘గ్రీష్మోల్లాసం’


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 25: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 7వ, 8వ, 9వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ‘గ్రీష్మోల్లాసం’ (సమ్మర్ క్యాంపు)ను తొర్రూర్ ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో రిబ్బన్ కట్ చేసి సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ సమ్మర్ క్యాంపుకు వివిధ జిల్లాల నుండి సుమారు 100 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారికి వసతి, పౌష్టికాహారం తదితర సౌకర్యాలు నెల రోజుల పాటు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం అకాడమిక్ విద్యకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో తమలోని నైపుణ్యాలను గుర్తించి అభివృద్ధి చెందేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సమ్మర్ క్యాంపు ముఖ్య ఉద్దేశ్యం పిల్లల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను మెరుగుపరచడం అని తెలిపారు. క్రీడలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, డిజిటల్ లిటరసీ వంటి అనేక అంశాలపై నిపుణులైన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి, డీఎల్‌పీఓ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, హాస్టల్ వార్డెన్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోహెన్స్ లైఫ్ సైన్సెస్ కార్మిక సంఘ అధ్యక్షుడిగా డా.జనక్ ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఏప్రిల్ 25:హైదరాబాద్ పాశమైలారంలోని కొహెన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ (సువేన్ ఫార్మాస్యూటికల్స్) సంస్థలో కార్మికులు తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా.జనక్ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా తమ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డా.జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ, తనను యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంస్థలో కార్మికుల సంక్షేమం, న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. యూనియన్ జనరల్ సెక్రటరీ రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్, శ్రీనివాస్, యూనియన్ నాయకులు, మహిళా నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# మహిళ విద్యా, ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

- లాభదాయక వ్యాపారాలపై దృష్టి సారించాలి - టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్
- మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 25 : మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణ, లాభదాయక వ్యాపారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. లైఫ్ స్కిల్స్, భద్రత, సైకిల్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతామని.. ఈ కార్యక్రమాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం, 'అమ్మకు అక్షరమాల', సెర్ప్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.

# బాలల సంక్షేమంలో జిల్లా అగ్రభాగాన నిలవాలి

**- మహిళా శిశు సంక్షేమంపై గ్రామ గ్రామానా అవగాహన కల్పించండి - జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.**
**- మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 25:ఈనెల 27 నుంచి మే 2 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, రక్షణ, సంక్షేమంపై వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమంలో కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన ఉంచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన అన్ని పథకాలు, కార్యక్రమాలపై గ్రామ గ్రామానా విస్తృతంగా ప్రజలకు అవగాహన పెంపొందించాలని సూచించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బాలల భద్రత, రక్షణ, సంక్షేమ వారం కార్యక్రమాలపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సఖి, స్వధార్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బాలల భద్రత, రక్షణ, సంక్షేమ వారం కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళ శిశు సంక్షేమంలో సిడిపిఓల పాత్ర కీలకమని, అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ, మాతా శిశు సంరక్షణ విషయంలో అత్యుత్తమ సేవలందించాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

తద్వారా వారంతా సంక్షేమ కార్యక్రమాల విజయవంతానికి తగిన సహాయ సహకారాలు అందిస్తారనీ, ప్రభుత్వ లక్ష్యం సిద్ధిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పక్కా ప్రణాళికతో




కార్యక్రమం విజయవంతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. సైబర్ మోసాలు, డ్రగ్ నియంత్రణ, చిన్నారులపై వేధింపుల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లను అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా మహిళా సంక్షేమ అధికారి సరస్వతి, డిపిఓ జగదీశ్వర్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ సంపత్ యాదవ్, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మి, సిడిపివోలు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతును రాజును చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనుల పరిశీలన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 25: రైతును రాజును చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలికోట సూరమ్మ ప్రాజెక్టు నుంచి ఎడమ, కుడి కాలువల పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్‌సీ, డీఈ, ఈఈ, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజల సమక్షంలో ఈ సమావేశం జరిగినట్లు పేర్కొన్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తూ, ఈ సాగు సీజన్‌కే రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూరమ్మ ప్రాజెక్టును ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేర్చారని తెలిపారు. కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల రైతులకు ఈ ప్రాజెక్టు వరప్రదాయినిగా మారుతుందని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సూరమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువ సుమారు 14 కిలోమీటర్లు, కుడి కాలువ 18 నుంచి 19 కిలోమీటర్ల వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పటివరకు భూ నిర్వాసితులకు రూ.45 కోట్ల 50 లక్షల నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. ఎడమ కాలువకు సంబంధించి కలికోట నుంచి చింతకుంట గ్రామం వరకు ఉన్న భూసేకరణ పూర్తయిందని అధికారులు వివరించారని చెప్పారు. అదేవిధంగా కుడి కాలువకు సంబంధించి రెండు గ్రామాల రైతులకు ఇప్పటికే నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఈరోజు జరిగిన సమీక్ష సమావేశంలో కాంట్రాక్టర్‌ను సంప్రదించి ఎడమ కాలువ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించగా, మరో వారం నుంచి పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి, తాగునీటి అవసరాలు కూడా తీరతాయని అన్నారు. సూరమ్మ ప్రాజెక్టు ముందు-తర్వాత ఈ ప్రాంత రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు రాబోతుందని, మూడు మండలాల రైతుల దీర్ఘకాల స్వప్నం సాకారం కానుందని తెలిపారు. ప్రాజెక్టు పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా, సాంకేతిక ప్రమాణాలు పాటిస్తూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ, ఎడమ కాలువ భూ నిర్వాసితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లించామని, కుడి కాలువ నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులకు కూడా పారదర్శకంగా పరిహారం అందిస్తామని తెలిపారు. అలాగే పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో శంకర్, కలికోట సర్పంచ్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నేటి నుంచి స్వయం జనగణన కార్యక్రమం

**- 'మన జనగణన-మన అభివృద్ధి'లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొనాలి.**
**- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 25: జిల్లాలో ఏప్రిల్ 26 ఆదివారం నుంచి స్వయం జనగణన కార్యక్రమం ప్రారంభమవుతున్నందున ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, సంబంధిత అధికారులతో కలిసి 'మన జనగణన-మన అభివృద్ధి', స్వయం గణన, ప్రభుత్వ భూముల పరిరక్షణ, సాదా బైనామాల పరిశీలన, 'మన ఇసుక-మన వాహనం' పథకం అమలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య కార్యక్రమమైన జనాభా గణన-2027 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జిల్లాలో స్వయం గణన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరూ పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఇండ్ల జాబితా గణన, జనాభా గణన మొదటి దశ మే 11 నుంచి జూన్ 9 వరకు 30 రోజుల పాటు కొనసాగుతుందని, ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని చెప్పారు. ఇంటి పరిస్థితి, వసతి సౌకర్యాలు, ప్రాథమిక వివరాలు ఈ దశలో సేకరించబడతాయని తెలిపారు. ప్రజలు ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ ఆన్‌లైన్ పోర్టల్‌ను సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడీ పొందాలని, ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జరిగే స్వయం గణనలో భాగంగా గుర్తించబడిన సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీని తెలియజేయాలని సూచించారు. జనగణన ద్వారా భవిష్యత్తు కార్యాచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం లభిస్తుందని, వనరుల సముచిత పంపిణీ, పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, ప్రాంతీయ అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా సురక్షితమని, జనాభా లెక్కల చట్టం--1948 ప్రకారం గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. పేర్లు, వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయబడవని, ఇతర దర్యాప్తుల కోసం ఉపయోగించబడవని తెలిపారు. సర్వే సిబ్బంది వచ్చినప్పుడు



ఖచ్చితమైన, సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో జనాభా గణన కార్యక్రమం నిర్వహణ కోసం సుమారు 1,764 మంది సిబ్బందిని నియమించి, వారికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టినట్లు పేర్కొన్నారు.అలాగే జిల్లాలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అక్రమ ఆక్రమణలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు.'మన ఇసుక -- మన వాహనం' పథకం కింద ఆన్‌లైన్ విధానం ద్వారానే ఇసుక విక్రయాల కూపన్లు పంపిణీ చేయాలని, అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, కృష్ణవేణి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థినిని సన్మానించిన దావ వసంత సురేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 25 : జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన సాందరికారి ఉమ--సురేష్ దంపతుల కుమార్తె సాందరికారి లహరి ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంకు, జగిత్యాల జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ శనివారం లహరిని అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ఒక్కటే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. కష్టపడి చదివితేనే లక్ష్యాలను చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. లహరి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, జగిత్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్‌కుమార్, కేసీఆర్ సైన్యం జగిత్యాల జిల్లా అధ్యక్షులు రాగుల రాజు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొడిసెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ ప్లేట్ల నిషేధ ఉద్యమానికి న్యాయవాది మద్దతు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 25: కోరుట్ల మండలం సర్వరాజపల్లి గ్రామ సర్పంచ్ నత్తి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్లాస్టిక్ ప్లేట్ల నిషేధ ఉద్యమానికి కోరుట్లకు చెందిన సీనియర్ న్యాయవాది, ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ బైరి విజయ్‌కుమార్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో కాన్సర్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గించి, ఆరోగ్యానికి హానికరం కాని స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా సర్పంచ్ నత్తి రాజ్‌కుమార్ చేపట్టిన ప్లాస్టిక్ ప్లేట్ల నిషేధ ఉద్యమం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ మంచి కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తన దివంగత తండ్రి, కవి, రచయిత, సామాజికవేత్త, రిటైర్డ్ ఉద్యోగి బైరి నర్సయ్య స్మారకార్థంగా 100 స్టీల్ ప్లేట్లను అందజేశారు. భవిష్యత్తులో కాన్సర్ వ్యతిరేకంగా చేపట్టే ప్రతి సామాజిక కార్యక్రమంలో ముందుండి సేవలందిస్తానని బైరి విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ దరిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ న్యాయమూర్తి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



# మహబూబాబాద్‌లో సిటీ హమాలీ రేట్ల పెంపు

**మర్చంట్ అసోసియేషన్ యాజమాన్యాలతో ఏఐటీయూసీ నేతల చర్చలు.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి) మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 25:మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కిరాణం జనరల్ మర్చంట్ అసోసియేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల రేట్ల పెంపుపై శనివారం సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. వర్తక సంఘం ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రత్న శేఖర్, ప్రధాన కార్యదర్శి బద్రి, కోశాధికారి మధురెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. అజయ్ సారథి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నేతలు యాజమాన్యాలతో చర్చిస్తూ, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో హమాలీ కార్మికుల వేతనాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా కార్మికులకు న్యాయమైన రేట్లు కల్పించాలని కోరారు. చర్చల అనంతరం హమాలీ రేట్ల పెంపుపై యాజమాన్యాలు మరియు ఏఐటీయూసీ నేతలు పరస్పర అంగీకారం వ్యక్తం చేసి, పెంచిన రేట్లకు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశారు.

# ఉద్యోగుల సమస్యల సాధన ఆత్మబలిదానాలతోనేనా..?

**- ఈ ఆనవాయితి మారాలి-ప్రభుత్వాలు ఆలోచించాలి.**
**- అమరుడు కోలా శంకర్ గౌడ్‌కు జోహార్లు-టీజీఈ జేఏసీ నేతలు.**



(ప్రజా లక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 25: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆత్మబలిదానాల వరకు వెళ్లాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని, ఈ ఆనవాయితి మారాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు తుమ్ రవీందర్ పటేల్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా చేపట్టిన సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చేయడం తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు కోలా శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం ముందుగానే ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినా స్పందన రాకపోవడంతో జేఏసీ సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం చర్చల ద్వారా సానుకూలంగా స్పందించి, సాధ్యమైన డిమాండ్లను ముందుగానే పరిష్కరించి ఉంటే డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చేసుకునే పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. శంకర్ గౌడ్ ఆత్మబలిదానం అనంతరం ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి చర్చల ద్వారా హామీ ఇవ్వడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, ఉద్యోగులు హక్కుల కోసం ప్రాణత్యాగం చేస్తేనే ప్రభుత్వాలు స్పందించే పరిస్థితి మంచిది కాదన్నారు. ఇకముందు ప్రభుత్వ ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఆత్మబలిదానాల బాట ఎంచుకోకుండా, ధైర్యంగా పోరాడి సాధించుకునే మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించే దిశగా ముందుకు రావాలని, మొండి నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని కోరారు. కోలా శంకర్ గౌడ్‌కు నివాళులర్పించిన వారిలో టీజీఓస్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి లెంకల బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి కరుణాకర్, ఉపాధ్యక్షులు ఎండి సాజిద్ అలీ, ఆఫీస్ సెక్రటరీ వి. రవీంద్రనాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ ఎం. రవీందర్, జిల్లా అధికారులు బి. భవిసింగ్, రంగారెడ్డి, సురేష్, పీఎన్జీఓఎస్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి. అనిత, వివిధ శాఖల ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లా టీజీఈ జేఏసీ చేపట్టనున్న నిరాహార దీక్షకు అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్ కోయ హర్షకు వినతిపత్రం సమర్పించారు.

# చెరువు తూము, మత్తడిని పరిశీలించిన అధికారులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, ఏప్రిల్ 25 : కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చెరువు తూము, మత్తడి దెబ్బతినడంతో శనివారం ఇరిగేషన్ శాఖ డీఈ తిరుమల కుమార్ గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. చెరువు పరిస్థితిని సమీక్షించి, మరమ్మతుల కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఈఈ సురేష్, ఏఈ సిరాజ్, గ్రామ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## పర్ఫెక్ట్ టైమింగ్ లో 'సతి లీలావతి'.. మెగా లావణ్యపై పాజిటివ్ వైబ్స్

వేసవి సెలవుల్లో థియేటర్లకు వచ్చే ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ ఒక పక్కా లోకల్ ఎంటర్టైనర్ సిద్ధమైంది. యాక్షన్ సినిమాలు, భారీ బడ్జెట్ హడావుడి మధ్య రిలేషన్ షిప్ డ్రామాలు పలకరించి చాలా కాలమైంది. ఆ లోటును భర్తీ చేసేందుకు లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ జంటగా 'సతి లీలావతి' మే 8న రాబోతోంది. 'భీమిలి కబడ్డీ జట్టు' ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చే సినిమాల్లో ఏదో ఒక సీరియస్ ఎమోషన్ ఉంటుంది, కానీ 'సతి లీలావతి' మాత్రం పూర్తి సరదాగా సాగిపోయే కథ. భార్యాభర్తల మధ్య ఉండే ఆధిపత్య పోరాటాన్ని కామెడీ యాంగిల్‌లో చూపిస్తూనే, నేటి తరం జంటలు రిలేట్ చేసుకునేలా ఈ మూవీని రూపొందించినట్లు నిర్మాత నాగ మోహన్ తెలిపారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో నాగా మోహన్ నిర్మించిన ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ క్లీన్ 'ఖ' సర్టిఫికెట్ ఇచ్చింది. అంటే ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఇంట్లోని చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి చూడొచ్చని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. సినిమా సక్సెస్ లో సంగీతం పాత్ర ఎప్పుడూ కీలకమే. మిక్కీ జె. మేయర్ అందించిన మెలోడీ సాంగ్స్ ఇప్పటికే వినేందుకు చాలా రిఫ్రెషింగ్‌గా ఉన్నాయి. అలాగే టీజర్ కంటెంట్ కూడా జనాలను బాగా ఎట్రాక్ట్ చేసింది. లావణ్య త్రిపాఠి కొణిదెల తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో మేజిక్ చేస్తుంటే, దేవ్ మోహన్ తన స్టైలిష్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. వీరికి తోడు సప్తగిరి, నరేష్, విటివి గణేష్ వంటి కమెడియన్ల టైమింగ్ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పాలి. బినేంద్ర మీనన్ విజువల్స్ పోస్టర్లలోనే చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నాయి. సాధారణంగా మే నెలలో వచ్చే సినిమాలకు సమ్మర్ అడ్వాంటేజ్ ఉంటుంది. వేడి తాపాన్ని మర్చిపోయి కాసేపు హాయిగా నవ్వుకోవాలని ఆడియన్స్ కోరుకుంటారు. ఆ అంచనాలను అందుకోవడానికి 'సతి లీలావతి' పర్ఫెక్ట్ పాప్‌కార్న్ మూవీలా కనిపిస్తోంది.


కేవలం రెగ్యులర్ ఎంటర్టైన్మెంట్ తరహాలో కాకుండా, భార్యాభర్తల బంధంలోని విలువను సున్నితంగా టచ్ చేసినట్లు తెలుస్తోంది. ఉదయ్ పొట్టిపాడు డైలాగ్స్ కూడా కథలోని ఇంటెన్సిటీని పెంచేలా ఉన్నాయని టీమ్ చెబుతోంది. ఇక సమ్మర్ హాలిడేస్ లో అన్ని వర్గాల ఆడియెన్స్ కోసం ఈ 'సతి లీలావతి' అస్త్రం సిద్ధమైంది. తాతినేని సత్య తన పాత ఫామ్ ను మళ్ళీ రిపీట్ చేస్తే, మే 8న బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ రావడం ఖాయం. ఒక ఫ్రెష్ జోడీని వెండితెరపై చూడాలనుకునే వారికి ఈ సినిమా ఒక మంచి ఆప్షన్ కాబోతోందని మేకర్స్ ధీమాగా ఉన్నారు. మరి ఈ సమ్మర్ బరిలో సతి లీలావతి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో, భార్యాభర్తల చిలిపి గొడవలు ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తాయో వేచి చూడాలి.






## నితిన్.. గోల్డెన్ పాపతో హిట్టొచ్చేనా?

టాలీవుడ్ హీరోల కెరీర్‌లో కొన్నిసార్లు టాలెంట్ కంటే సెంటిమెంటే ఎక్కువ కనిపిస్తుంటుంది. ముఖ్యంగా నితిన్ విషయానికొస్తే, ఆయనకు హిట్ రావాలంటే ఒక పక్కా హీరోయిన్ సెంటిమెంట్ ఉండాలని ఇండస్ట్రీలో ఒక గట్టి నమ్మకం ఉంది. నిత్యా మీనన్ నుంచి రష్మిక మందన్నా వరకు.. నితిన్ కెరీర్ మలుపు తిప్పిన సినిమాల వెనుక హీరోయిన్ల లక్ ఫ్యాక్టర్ స్పష్టంగా కనిపిస్తుంది. ఇప్పుడు మళ్ళీ అదే మేజిక్ రిపీట్ చేయడానికి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఒక క్రేజీ కాంబినేషన్ సెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి అందరి చూపు 'మిరాయ్' సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న రితికా నాయక్ వైపు ఉంది. అసలు విషయం ఏంటంటే, నితిన్ హీరోగా సితార బ్యానర్‌లో రాబోతున్న కొత్త సినిమా కోసం రితికా నాయక్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇది ఇంకా అధికారికంగా కన్ఫర్మ్ కాకపోయినా, ఆమెనే ఫస్ట్ ఛాయిస్ అని ఫిల్మ్ నగర్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. మిరాయ్ సినిమాలో రితికా స్క్రీన్ ప్రెజెన్స్, ఆమెకు సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ చూసి మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాక్. నితిన్ కెరీర్ ఇప్పుడు కొంత ఒడిదుడుకులో ఉంది కాబట్టి, రితికా లాంటి ఫ్రెష్ ఫేస్ తోడవ్వడం ఖచ్చితంగా ప్లస్ అవుతుందని టీమ్ భావిస్తోంది. రితికా నాయక్ ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక 'గోల్డెన్ లెగ్'లా కనిపిస్తోంది. ఆమె ఇదివరకు నటించిన అశోక వనంలో అర్జున్ కూడా మంచి ఫలితాన్ని ఇచ్చింది. చేసిన తక్కువ సినిమాలైనా అమ్మడి అందానికి మంచి క్రేజ్ ఉంది. యూత్ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో సక్సెస్ అయ్యే ఛాన్స్ ఉంది. గతంలో 'ఇష్క్' సినిమాతో నిత్యా మీనన్, 'భీష్మ'తో రష్మిక నితిన్ మార్కెట్‌ను ఎలాగైతే రిఫ్రెష్ చేశారో, ఇప్పుడు రితికా కూడా అదే రేంజ్‌లో లక్ తీసుకొస్తుందని ఫ్యాన్స్ ఆశపడుతున్నారు. సితార బ్యానర్ అంటేనే ఒక మినిమమ్ గ్యారెంటీ బ్రాండ్ కాబట్టి, ఈ క్రేజీ కాంబోపై ఇప్పుడే అంచనాలు మొదలయ్యాయి. నిజానికి నితిన్ గత కొన్ని సినిమాల ఫలితాలు ఆయన్ని కొంత ఇబ్బందుల్లోకి నెట్టాయి. 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' బాక్సాఫీస్ వద్ద నిలబడకపోవడంతో థియేట్రికల్ వాల్యూ తగ్గింది. ఇలాంటి టైమ్‌లో మళ్ళీ తన స్ట్రాంగ్ ఏరియా అయిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ వైపు ఫోకస్ పడింది. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నాయి. దర్శకుడు ఎవరు, కథా నేపథ్యం ఏంటి అనే వివరాలు త్వరలోనే బయటకు రానున్నాయి. హీరోయిన్ గా రితికా నాయక్ పేరు అఫీషియల్ గా అనౌన్స్ అయితే మాత్రం సినిమా బిజినెస్ పరంగా కూడా ఒక మెట్టు ఎక్కుతుందనడంలో సందేహం లేదు. వరుస వైఫల్యాల తర్వాత నితిన్ ఆడుతున్న ఈ సేఫ్ గేమ్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో చూడాలి. ఒక ఫ్రెష్ కాంబినేషన్, పక్కా కమర్షియల్ బ్యానర్ తోడైతే నితిన్ మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కడం పెద్ద కష్టమేమీ కాదు.



## 'లెనిన్'ను ఇరికించేశారే..

టాలీవుడ్లో మరే కొత్త హీరోకూ అరంగేట్రంలో రాని హైప్ అక్కినేని కుర్రాడు అఖిల్‌కు వచ్చింది. మెగాస్టార్ తనయుడు రామ్ చరణ్ తొలి సినిమా 'చిరుత'ను మించి.. అఖిల్ డెబ్యూ మూవీ 'అఖిల్'కు క్రేజ్ కనిపించిందంటే అతిశయోక్తి ఏమీ కాదు. అరంగేట్రానికి ముందే అతను ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించాడు. 'అఖిల్'నేరుగా సూపర్ స్టార్ అయిపోతాడని అక్కినేని ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఊహించనిది జరిగింది. 'అఖిల్' డిజాస్టర్ అయింది. ఇక అప్పట్నుంచి హీరోగా నిలదొక్కుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాడు కానీ.. ఫలితం ఉండట్లేదు. 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్'తో కాస్త కుదురుకున్నట్లే కనిపించినా.. 'ఏజెంట్'తో మళ్లీ పాతాళానికి పడిపోయాడు. ఇప్పుడిక తన ఆశలన్నీ 'లెనిన్' మీదే ఉన్నాయి. కానీ ఈ సినిమాకు రిలీజ్ విషయంలో తలనొప్పులు తప్పట్లేదు. ఏప్రిల్ 30న 'పెద్ది'తో వస్తున్న రామ్ చరణ్ కోసం అఖిల్ తన సినిమాను మే 1 నుంచి వాయిదా వేసుకుంట్నున్నట్లు ప్రకటించుకున్నారు కానీ.. ఇందులో త్యాగం ఏమీ లేదని కొన్ని రోజులకే తేలిపోయింది. 'పెద్ది' వాయిదా పడ్డా సరే.. మే 1న 'లెనిన్'ను రిలీజ్ చేయలేని పరిస్థితి కనిపించేసరికి అసలు విషయం జనాలకు అర్థమైపోయింది. దీంతో అనవసర నెగెటివిటీ ముసురుకుంది 'లెనిన్' చుట్టూ. మే 1 నుంచి వాయిదా వేసినపుడు 'లెనిన్' కోసం ఎంచుకున్న కొత్త డేట్ జూన్ 25. కానీ ఇప్పుడు 'పెద్ది' కొత్త డేట్ అదే కావచ్చని జోరుగా వార్తలు వస్తున్నాయి. ముందు 'టాక్సిక్' జూన్ 4 నుంచి వాయిదా పడుతుందేమో ఆ డేట్‌కు వద్దామని 'పెద్ది' టీం అనుకుంది. కానీ 'టాక్సిక్' వాయిదా ఉండదని.. చెప్పిన డేటుకే వచ్చేస్తుందని తాజాగా సమాచారం అందడంతో.. ఆ సినిమా నుంచి మూడు వారాల గ్యాప్ తీసుకుని జూన్ 25న తమ సినిమాను రిలీజ్ చేయాలని 'పెద్ది' టీం ఫిక్సయినట్లే కనిపిస్తోంది. 'లెనిన్' గురించి ఆలోచించే పరిస్థితిలో 'పెద్ది' టీం లేదు. ఈ చిత్రం ఎప్పుడెప్పుడు రిలీజవుతుందా అని ఇటు ట్రేడ్.. అటు ఆడియన్స్.. మొత్తంగా ఇండస్ట్రీనే ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. 'పెద్ది' లాంటి భారీ చిత్రం వీలైనంత త్వరగా రావడం ఇండస్ట్రీకి చాలా అవసరం. కాబట్టి 'లెనిన్' కోసం 'పెద్ది' ఇంకా వెనక్కి వెళ్లే అవకాశం లేదు. ఇంతకుముందు డెడ్ లైన్ అందుకోలేని పరిస్థితుల్లో ఊరికే 'పెద్ది' పేరు చెప్పి 'లెనిన్'ను వాయిదా వేసింది టీం. కానీ ఇప్పుడు 'పెద్ది'తో తలపడలేక డేట్ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో ఈసారి డేట్ మార్చుకునే సమయంలో కారణం ఏం చెబుతారన్నది ఆసక్తికరం. మొత్తానికి రిలీజ్ డేట్ వ్యవహారం 'లెనిన్'కు పెద్ద తలనొప్పిగా మారింది పాపం.



## అడివి శేష్ 'డెకాయిట్'.. ఓవర్సీస్ లో సైలెంట్ ర్యాంపేజ్!

పెద్ద స్టార్ల సినిమాలు కూడా విదేశీ గడ్డపై వసూళ్ల కోసం కష్టపడుతున్న తరుణంలో, ఒక మిడియం రేంజ్ సినిమా సైలెంట్ గా వచ్చి రికార్డులు క్రియేట్ చేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అడివి శేష్ సినిమా అంటే ఏదో ఒక డిఫరెంట్ కంటెంట్ ఉంటుందనే నమ్మకం ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అందుకే భారీ హడావుడి లేకపోయినా, కంటెంట్ మీద ఉన్న భరోసాతో ఆడియన్స్ సినిమా చూస్తారు. లేటెస్ట్ గా 'డెకాయిట్: ఎ లవ్ స్టోరీ' ఓవర్సీస్ బాక్సాఫీస్ వద్ద సాధిస్తున్న వసూళ్లు చూస్తుంటే శేష్ బ్రాండ్ వాల్యూ ఏంటో మరోసారి అర్థమవుతుంది. ఒక సినిమా ప్రాఫిట్ జోన్‌లోకి రావాలంటే మొదటి వీకెండ్ తరువాత కూడా క్లిక్ అవ్వాలి. 'డెకాయిట్' ఓవర్సీస్ టార్గెట్ 1.3 మిలియన్ డాలర్స్. అయితే, ఈ చిత్రం ఇప్పటికే ఆ మార్కును దాటేసి 1.4 మిలియన్ల డాలర్ల గ్రాస్‌తో అధికారికంగా లాభాల బాట పట్టింది. కథను నమ్ముకుంటే మార్కెట్‌లో ఎలాంటి మంచి కలెక్షన్స్ ఉంటాయి. 'మేజర్', 'హిట్ 2' సినిమాలతో శేష్ సంపాదించుకున్న క్రెడిబిలిటీ ఇప్పుడు ఈ సినిమాకు పెద్ద ప్లస్ అయ్యింది. మేకర్స్ సినిమాను భారీ పాన్ ఇండియా హంగులతో కాకుండా, కథకు అవసరమైనంత వరకే ఖర్చు పెట్టి రియలిస్టిక్‌గా తెరకెక్కించారు. దీనివల్ల రిలీజ్ కు ముందే బిజినెస్ పరంగా బయ్యర్లు సేఫ్ జోన్‌లో ఉన్నారు. ఇప్పుడు వస్తున్న ప్రతి డాలర్ లాభాల కిందకే లెక్క. ముఖ్యంగా యూఎస్‌లో ప్రీమియర్స్ నుంచే మంచి సినిమా అనే టాక్ రావడంతో వీక్‌డేస్‌లో కూడా వసూళ్లు నిలకడగా ఉన్నాయి. సెకండ్ వీకెండ్ నాటికి ఈ వసూళ్లు 1.5 మిలియన్ డాలర్స్ మార్కును తాకే అవకాశం ఉంది. నటన పరంగా అడివి శేష్ తో పాటు మృణాల్ ఠాకూర్ ఎంపిక కూడా సినిమాకు బాగా హెల్ప్ అయ్యింది. పోస్టర్లలో ఆమె ఇంటెన్స్ లుక్, ఎమోషనల్ సీన్లు ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించగలిగాయి. ఇది కేవలం దోపిడీల చుట్టూ తిరిగే యాక్షన్ సినిమా మాత్రమే కాదు, బలమైన ప్రేమకథ కూడా అనే విషయం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యింది. అందుకే యువతతో పాటు కపుల్స్ ఈ సినిమాను చూడటానికి ఇష్టపడుతున్నారు. అడివి శేష్ తనకంటూ ఉన్న ఒక ప్రత్యేకమైన మార్కెట్‌ను పదిలపరుచుకున్నారు. స్టార్‌డమ్ కంటే స్టోరీ పవరే గొప్పదని ఆయన మరోసారి నిరూపించారు. 'డెకాయిట్' ఇంకా సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుండటంతో ఫైనల్ గా ఈ సినిమా ఎక్కడ ఆగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరోగ్యం



## అరటి తొక్కను పారేస్తున్నారా? ఈ అద్భుత ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు!

పేదవాడి అమృతంగా అరటిపండును చెబుతారు. తక్కువ ధరలో అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండే అరటిపండు మన ఆరోగ్యానికి చేసే మేలు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే సాధారణంగా మనం అరటికాయను తినేసి దాని తొక్కను పడేస్తుంటాం. దాదాపు అందరూ చేసే పనే ఇది. కానీ, మీరు పనికిరానిదిగా భావించి పారేస్తున్న ఆ తొక్కలో ఎన్నో ఆరోగ్య రహస్యాలు, సౌందర్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని మీకు తెలుసా? ఆయుర్వేదం నుంచి ఆధునిక శాస్త్రవేత్తల వరకు అరటి తొక్కలోని ఔషధ గుణాలను గుర్తించారు. పోషకాల గని అరటి తొక్క అరటి తొక్క ఒక పోషకాల గని. ఇందులో ఫైబర్, పొటాషియం, విటమిన్ %బీ%6, విటమిన్ %జ%, మెగ్నీషియం, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి మన శరీరాన్ని ఒక కవచంలా కాపాడతాయి. జీర్ణవ్యవస్థను పటిష్టం చేయడం నుంచి రక్తపోటుని అదుపులో ఉంచడం, రోగనిరోధక శక్తిని పెంచడం దాకా అరటి తొక్క కీలక పాత్ర పోషిస్తుంది.

ఆరోగ్యానికి అండగా గుండెకు రక్షణ: అరటి తొక్కలో ఉండే కరిగే ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (%ూణూ%) లెవల్స్ ను తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది. మీ గుండె పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అరటి తొక్కను మీ ఆహారంలో చేర్చుకోవడం గురించి ఆలోచించవచ్చు. షుగర్ పేషెంట్లకు వరం: అరటి తొక్కలోని ఫైబర్, రక్తంలోకి చక్కెర శోషణ ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఇది రక్తంలో షుగర్ లెవల్స్ సడెన్ గా పెరగకుండా నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇది షుగర్ పేషెంట్లకు చాలా ప్రయోజనకరం. బరువు తగ్గడంలో సహాయం: బరువు తగ్గాలనుకునే వారికి అరటి తొక్క మేలు చేస్తుంది. ఇందులో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కలిగిస్తుంది. ఇది అతిగా తినడాన్ని నియంత్రిస్తుంది, జీవక్రియ రేటును పెంచి, శరీరంలో కొవ్వు కరిగే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

అందాన్ని ఇనుమడింపజేస్తుంది కేవలం ఆరోగ్యానికే కాదు మీ అందాన్ని రెట్టింపు చేయడంలో కూడా అరటి తొక్క ముందుంటుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మానికి, జుట్టుకు అద్భుతంగా పనిచేస్తాయి. అరటి తొక్క లోపలి భాగాన్ని ముఖంపై సున్నితంగా రుద్దడం వల్ల మొటిమలు, మచ్చలు, నల్లటి వలయాలు తగ్గుముఖం పడతాయి. తొక్కను మెత్తగా పేస్ట్ చేసి జుట్టుకు పట్టిస్తే చుండ్రు సమస్య దూరమై, జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. ఎలా తినాలి? అయితే అరటి తొక్కను నేరుగా తినకూడదు. దానిపై పురుగుమందుల అవశేషాలు, మైనపు పూతలు ఉండే అవకాశం ఉంటుంది కాబట్టి ఉపయోగించే ముందు తొక్కను గోరువెచ్చని ఉప్పు నీటిలో శుభ్రంగా కడగాలి. తర్వాత కొన్ని నిమిషాల పాటు ఉడికించడం లేదా ఆవిరిపై ఉంచడం వల్ల అది మెత్తబడి, చేదుదనం తగ్గుతుంది. ఈ ఉడికించిన తొక్కను మీరు స్మూతీలలో, కూరలలో, చట్నీలలో లేదా టీ రూపంలో కూడా తీసుకోవచ్చు.

## నవరాత్రి స్పెషల్..10 నిమిషాల్లో అమ్మవారికి ప్రీతికరమైన బాదం మఖానా ఖీర్..

ఈ ఏడాది అక్టోబర్ 2న దసరా పండుగను సెలబ్రేట్ చేసుకుంటారు. దసరా పండుగలో మొదటి తొమ్మిది రోజులను నవరాత్రులు అంటారు. ఈ తొమ్మిది రోజులు దుర్గాదేవి తొమ్మిది రూపాలను (శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి) అలంకరించి పూజిస్తారు. ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రులు ఎంతో శుభప్రదమైన రోజుల్లో ప్రారంభం కానున్నాయి. శరన్నవరాత్రులు 22 సెప్టెంబర్ 2025, సోమవారం నుంచి ప్రారంభమై.. 30 సెప్టెంబర్ 2025, మంగళవారం వరకు జరుగుతాయి. శరన్నవరాత్రి ఉత్సవాల శోభ దేశమంతటా వెల్లివిరుస్తోంది. తొమ్మిది రోజుల పాటు దుర్గామాతను నవ రూపాల్లో ఆరాధిస్తూ, ప్రతి ఇల్లూ భక్తిశ్రద్ధలతో నిండిపోతుంది. ఈ పవిత్రమైన రోజుల్లో ఉపవాస దీక్ష చేపట్టడం ఒక ముఖ్యమైన సంప్రదాయం. అయితే ఉపవాసం అంటే కేవలం ఆహారం మానెయ్యడమే కాదు, అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి, వాటిని ప్రసాదంగా స్వీకరించడం కూడా అందులో భాగమే. ఉపవాస సమయంలో ఏం తినాలి, అమ్మవారికి తేలికగా ఏం నైవేద్యం పెట్టాలి అని ఆలోచిస్తున్నారా? అయితే బాదం మఖానా ఖీర్ చేయండి. ఇది కేవలం 10-15 నిమిషాల్లో సిద్ధమైపోతుంది. ఇది దుర్గాదేవికి అత్యంత ప్రీతికరమైన నైవేద్యాలలో ఒకటిగా భావిస్తారు. ఈ ఖీర్ రుచికి అమోఘంగా ఉండటమే కాకుండా, ఉపవాస సమయంలో శరీరానికి కావలసిన శక్తిని కూడా అందిస్తుంది. బాదం మఖానా ఖీర్ ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.



కావాల్సిన పదార్థాలు -పాలు (చిక్కటివి) - అర లీటరు -తామర గింజలు (మఖానా) - ఒక కప్పు -బాదం పప్పులు - 15-20 -నెయ్యి - ఒక టేబుల్ స్పూన్ -పంచదార - మీ రుచికి సరిపడా - కుంకుమ పువ్వు - చిటికెడు -యాలకుల పొడి - అర టీస్పూన్.

తయారీ విధానం -ముందుగా మందపాటి అడుగున్న బాండీలిలో నెయ్యి వేసి వేడిచేయాలి. నెయ్యి కరిగాక మఖానా, బాదం పప్పులు వేసి అవి బంగారు వర్ణంలోకి మారి, కమ్మటి వాసన వచ్చేవరకు సన్నని మంటపై వేయించుకోవాలి. వాటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని చల్లారనివ్వాలి. -ఇప్పుడు అదే బాండీలిలో పాలు పోసి అందులో కుంకుమపువ్వు రేకులు వేసి మరిగించాలి. పాలు ఒక పొంగు వచ్చాక, మంట

తెలుగు వంటలు

తగ్గించి, అడుగంటకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. పాలు కొద్దిగా చిక్కబడుతున్నప్పుడు, అందులో పంచదార వేసి పూర్తిగా కరిగే వరకు కలపాలి. తర్వాత వేయించి పెట్టుకున్న మఖానా, బాదం పలుకులను పాలలో వేయాలి. మఖానా మెత్తబడి, పాలు మరింత చిక్కగా అయ్యేంత వరకు సుమారు 5-7 నిమిషాలు ఉడికించాలి. చివరగా యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే నోరూరించే వేడివేడి బాదం మఖానా ఖీర్ రెడీ. దీనిపై సన్నగా తరిగినబాదం, పిస్తా పలుకులతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించండి. -ఈ ఖీర్ ను వేడిగా లేదా చల్లగా ఎలా తీసుకున్నా అద్భుతంగా ఉంటుంది.

## నోరూరించే వైట్ మటన్ కుర్మా.. పూరీ,చపాతీలోకి అబ్బో కేక అంతే..



వీకెండ్ వస్తే చాలు చాలా ఇళ్లలో మటన్ ఘుమఘుమలు మొదలవుతాయి. అయితే ఎప్పుడూ చేసుకునే రొటీన్ మటన్ కూరతో విసుగొచ్చిందా? ఈసారి మీ రుచిని ఒక మెట్టు పైకి తీసుకెళ్లే సరికొత్త వంటకాన్ని ప్రయత్నించాలనుకుంటున్నారా? అయితే రెస్టారెంట్ స్టైల్ లో ఉండే వైట్ మటన్ కుర్మా ఓ సారి ట్రై చేసి చూడండి. మసాలాలు, జీడిపప్పు, బాదంల క్రీమీ టెక్స్చర్ తో, మృదువుగా ఉడికిన మటన్ ముక్కలతో ఈ కుర్మా రుచి అమోఘం. దీని తయారీ కూడా చాలా సులభం. వేడివేడి నాన్ లు, చపాతీలు, పుల్కాలు,పూరీ, బిర్యానీతో దీనిని తింటుంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిది. రెస్టారెంట్ స్టైల్ లో వైట్ మటన్ కుర్మా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

**కావలసిన పదార్థాలు మటన్ ఉడికించడానికి: -మటన్:** అర కిలో -అనాసపువ్వు: 1 -దాల్చిన చెక్క: 1 అంగుళం ముక్క -జాపత్రి: కొద్దిగా -పచ్చిమిర్చి: 1 -అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టేబుల్ స్పూన్ -నీరు: తగినంత మసాలా పేస్ట్ కోసం: -నూనె: 3 టేబుల్ స్పూన్లు -ఉల్లిపాయలు: 2 -జీడిపప్పు: 20 -బాదం: 10 -ధనియాల పొడి: పావు టేబుల్ స్పూన్ -పచ్చిమిర్చి: 2 -పాలు: 100 మి.లీ -గట్టి పెరుగు: 2 టేబుల్ స్పూన్లు కుర్మా తయారీకి: -: 3 టేబుల్ స్పూన్లు -బిర్యానీ ఆకులు: 2 -దాల్చిన చెక్క: 2 చిన్న ముక్కలు -లవంగాలు: 5 -కసూరి మేతి: కొద్దిగా -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -గట్టి పెరుగు: 100 మి.లీ -పాలు: 100 మి.లీ -మిరియాల పొడి: అర టేబుల్ స్పూన్ -నిమ్మరసం: సగం చెక్క -ఉప్పు: రుచికి సరిపడా -కొత్తిమీర, పుదీనా: కొద్దిగా (సన్నగా తరిగినవి).

తయారీ విధానం -ముందుగా శుభ్రం చేసుకున్న మటన్ ను ప్రెషర్ కుక్కర్ లో వేయండి. అందులోనే అనాసపువ్వు, దాల్చిన చెక్క, జాపత్రి, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ముక్కలు మునిగే వరకు నీరు పోసి 8-10 విజిల్స్ వచ్చేదాకా ఉడికించి పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు మసాలా పేస్ట్ కోసం బాండీలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి మారే వరకు వేయించి, చల్లారనివ్వండి.-చల్లారిన ఉల్లిపాయలను మిక్సీ జార్ లో వేసి, జీడిపప్పు, బాదం, ధనియాల పొడి, పచ్చిమిర్చి, పాలు, పెరుగు వేసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోండి. -ఇప్పుడు కుర్మా కోసం మరో మందపాటి గిన్నెలో నూనె వేడి చేసి బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, లవంగాలు వేసి చిటపటలాడనివ్వండి. కసూరి మేతిని కూడా నలిపి వేసి వేయించండి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి 100 మి.లీ పెరుగు వేసి నూనె పైకి తేలేదాకా కలపండి. -ఇప్పుడు ఉడికించిన మటన్ ను నీళ్లతో సహా అందులో వేసి గ్రైండ్ చేసుకున్న మసాలా పేస్ట్, మిగిలిన పాలు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. -గిన్నెపై మూత పెట్టి సన్నని మంట మీద 15-20 నిమిషాలు లేదా గ్రేవీ చిక్కబడి నూనె పైకి తేలే వరకు ఉడికించండి. -చివరగా మిరియాల పొడి, తరిగిన కొత్తిమీర, పుదీనా, నిమ్మరసం వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేయండి. అంతే నోరూరించే క్రీమీ వైట్ మటన్ కుర్మా రెడీ.

## ఉడుపి హోటల్ స్పెషల్..కమ్మనైన,కారమైన తన్నీ చట్నీ.. ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే



రోజూ ఉదయాన్నే చేసే ఇడ్లీకి ఎప్పుడూ ఒకేరకమైన కొబ్బరి చట్నీ చేసి విసుగు చెందారా? మీ కుటుంబ సభ్యులు కూడా కొత్త రుచి కోసం ఎదురుచూస్తున్నారా? అయితే ఈసారి మీ వంటగదిలో ఓ చిన్న మ్యాజిక్ చేసి, కర్ణాటకలోని ప్రసిద్ధ ఉడుపి హోటళ్లలో వడ్డించే అసలైన తన్నీ చట్నీని ప్రయత్నించండి. దీనిని నీరు చట్నీ అని మనం పిలుస్తుంటాం.

తన్నీ అంటే నీళ్లు. పేరుకు తగ్గట్టే ఈ చట్నీ కాస్త పల్చగా, కమ్మటి కొబ్బరి రుచితో, పచ్చిమిర్చి ఘాటుతో, నోరూరించే తాళింపు సువాసనతో అద్భుతంగా ఉంటుంది. ఈ చట్నీ ఒక్కసారి రుచి చూశారంటే మామూలుగా తినే ఇడ్లీల కన్నా కచ్చితంగా రెండు ఎక్కువ తింటారు. అంతటి రుచి దీని సొంతం. ఆ ఘుమఘుమలాడే చట్నీ ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

కావలసిన పదార్థాలు నూనె - 1 టేబుల్ స్పూన్ పచ్చిమిర్చి - 6 (మీ కారానికి తగినట్టు) కరివేపాకు - ఒక రెమ్మ జీడిపప్పు - 2 టేబుల్ స్పూన్లు వేరుశనగపప్పు - 2 టేబుల్ స్పూన్లు పచ్చి కొబ్బరి తురుము - అర కప్పు అల్లం - అర అంగుళం ముక్క చింతపండు - చిన్న నిమ్మకాయంత ఉప్పు - రుచికి సరిపడా కొత్తిమీర - కొద్దిగా నీరు - అవసరమైనంత తాళింపు కోసం: కొబ్బరి నూనె - 2 టేబుల్ స్పూన్లు ఆవాలు - 1 టీస్పూన్ మినపప్పు - 1 టీస్పూన్ జీలకర్ర - పావు టీస్పూన్ కరివేపాకు - ఒక రెమ్మ ఎండు మిర్చి - 1.

తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద బాండీ పెట్టి నూనె వేసి వేడి చేయండి. నూనె వేడెక్కాక పచ్చిమిర్చి, కరివేపాకు వేసి చిటపటలాడే వరకు వేయించాలి.-ఇప్పుడు అందులోనే జీడిపప్పు, వేరుశనగపప్పు వేసి మంచి సువాసన వస్తూ దోరగా బంగారు రంగులోకి మారే వరకు వేయించి, స్టవ్ ఆపి చల్లారనివ్వాలి. -చల్లారిన ఈ మిశ్రమాన్ని ఒక మిక్సీ జార్ లోకి తీసుకోండి. దానికి పచ్చి కొబ్బరి తురుము, అల్లం ముక్క, చింతపండు, రుచికి సరిపడా ఉప్పు, తాజా కొత్తిమీర జోడించండి. కొద్దిగా నీళ్లు పోసి మెత్తని ముద్దలా రుబ్బుకోవాలి. -ఇప్పుడు ఈ రుబ్బిన చట్నీని ఒక గిన్నెలోకి మార్చి సుమారు ఒక కప్పు నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ చట్నీ ప్రత్యేకతే దాని పల్చటిదనం, కాబట్టి జారుగా ఉండేలా చూసుకోండి.

-చివరిగా తాళింపు కోసం చిన్న పాన్ లో కొబ్బరి నూనె వేడి చేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర వేసి చిటపటలాడనివ్వండి. ఆ తర్వాత ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించి, ఈ ఘుమఘుమలాడే తాళింపును చట్నీపై వేసి కలపండి. అంతే కమ్మనైన, కారమైన ఉడుపి హోటల్ స్టైల్ తన్నీ చట్నీ రెడీ.



# తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ

మొదటిపేజీ తరువాయి

ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా.

తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు.

ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

## బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

## తండ్రి పిట్టల దొర..బిడ్డ పిట్టల దొరసాని

మొదటిపేజీ తరువాయి

గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

## తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

మొదటిపేజీ తరువాయి

తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉంది.. పూర్తిగా కార్బన్-÷బైర్ బాడీ రాకెట్. కార్బన్ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

# అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

- ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- 27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు
- ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్25 : బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

# మే9న ప్రధాని మోడీ పర్యటన

## రాష్ట్రంలో పలు ప్రాజక్టులకు ప్రారంభోత్సవాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్25 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో వచ్చే నెల 9వ తేదీన పర్యటించనున్నారు. ప్రధాని పర్యటనలో భాగంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలుస్తోంది. అలాగే ఇప్పటికే పూర్తయిన కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు కూడా ఉండే అవకాశముంది. ముఖ్యంగా ఎంఎంటిఎస్ 2ను జాతికి అంకితం చేసే అంశం ఈ పర్యటనలో ప్రధానంగా ఉండొచ్చని సమాచారం. హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచే ఈ ప్రాజెక్ట్ ప్రజా ప్రయాణానికి కీలకంగా మారనుంది. అలాగే ఎయిమ్స్ బీబీనగర్ ఆస్పత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రి తెలంగాణతో పాటు సమీప రాష్ట్రాల ప్రజలకు కూడా వైద్యసేవల్లో పెద్ద మార్పు తీసుకురానుంది. ఇవే కాకుండా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారని సమాచారం. రవాణా, కనెక్టివిటీ రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలకమని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

ఇక మరో అంశంగా మల్లారెడ్డి యూనివర్సిటీ పర్యటన కూడా ప్రధాని షెడ్యూల్‌లో ఉండొచ్చని చర్చ జరుగుతోంది. అయితే ఇది ఇంకా అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభాలు, రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ, ఆరోగ్య రంగంలో కొత్త సదుపాయాలపై కేంద్రీకృతమై ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని అధికారిక షెడ్యూల్ పూర్తిగా ప్రకటించాల్సి ఉంది.

## అజారుద్దీన్, కోదండ రామ్‌లకు ఊరట

మొదటిపేజీ తరువాయి

కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు. దీంతో ఈ ఇద్దరు ఇక ఎమ్మెల్సీలుగా కొనసాగనున్నారు.

## మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి

ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## గుంటనక్కలు, తోడేళ్ల మధ్య కెసిఆర్ బందీ

మొదటిపేజీ తరువాయి

కాలేదు. కేసీఆర్ పాలనలో ఆశించిన ఫలితాలు రాలేదు. బానిస సంకెళ్లు తెగుతాయనుకుంటే రైతులకు బేడీలు ఉద్యమకారులకు కేసులు వచ్చాయి. ఆనాడు పాలించిన కుటుంబంలో నేను ఒకదాన్ని. నాడు జరిగిన తప్పులకు క్షమించమని కోరుతున్నా. తెలంగాణ ప్రజల కలల సాకారం కోసం తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావించింది. రేపటి నుంచి చూస్తారు మా పని ఎలా ఉంటుందో మా పోరాటం ఎలా ఉంటుందో.' అని కవిత అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి కవిత సంచలన వ్యాఖ్యల చేశారు. ఆ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందన్నారు. అమ్మతనంతో పాలన సాగిస్తే ప్రజల కష్టాలు తెలుస్తాయని.. అనేకమంది తెలంగాణ రాష్ట్ర వచ్చిందన్నారు. నీళ్ల కోసం ఒక లక్ష ఇరవై ఒక్క వేల కోట్లు ఖర్చు పెట్టిందని.. 14 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చిందన్నారు. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరన్నారు. ఇప్పుడు కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి అన్నారు. 'ఆ సారు రారు.. గుంట నక్కల తోడేళ్ళ మధ్యలో బందీ అయిన మనిషి కేసీఆర్. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు ఏమి తెలియదు కాబట్టి మాట్లాడరు అనుకుందాం. కానీ కేసీఆర్ ఎందుకు మాట్లాడట్లేదు. ఆనాడు టీఆర్ఎస్ కోసం, కేసీఆర్ కోసం కొట్లాడిన వాళ్లకు ఏమి దక్కింది? ఇది మన కేసీఆర్ కాదు.. నేను కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పాను. నన్ను బయటకు పంపి.. పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఇప్పుడు మనమే ప్రతిపక్షం అవుతాం. రెండేళ్ల తర్వాత మనమే అధికార పక్షం అవుతాం' అని కవిత వ్యాఖ్యానించారు.

## ఖచ్చితంగా ముఖ్యమంత్రిని అవుతా...!

మొదటిపేజీ తరువాయి

ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గన్‌పార్కు వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి మునీరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరారు.

## రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

మొదటిపేజీ తరువాయి

బలోపేతం చేస్తూనే ప్రైవేట్ స్కూళ్లలో కూడా ఫ్రీగా విద్య అందిస్తాం... ఏ రోగమైనా రానీ, ఏ ఆస్పత్రైనా సరే ఉచితంగా అందిస్తాం.. వ్యవసాయం: రైతే రాజు అన్న నినాదాన్ని నిజం చేస్తాం.. ఉపాధి: రూ.2 లక్షల-రూ.20 కోట్ల వరకు యువతకు రుణాలు..ప్రభుత్వం దా÷-వారానే అందిస్తాం. మొదటి ఏడాదిలోనే సింగిల్ నోటిఫికేషన్‌లో 4 లక్షల ఉద్యోగాలు నియమిస్తాం. ఉద్యమకారుల కు లక్ష సూపర్ న్యూమరీ ఉద్యోగాలు ఇస్తాం.. . సామాజిక న్యాయం సాధించాల్సిందే' అని ప్రకటించారు. అనంతరం బీఆర్ఎస్, కేసీఆర్ గురించి కవిత మాట్లాడారు. 'మన కేసీఆర్ అయ్యింటే పాలమూరు ప్రాజెక్టును కట్టించేవారు. మారిన కేసీఆర్ పంజాబ్ వెళ్లారు. జాతీయ పార్టీ పెడతానని చెప్పారు. సింగరేణిలో గనిలో కార్మికుడు చనిపోతే చూసొచ్చే వ్యక్తి. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయారు. కేటీఆర్ మాట్లాడారంటే అనుకోవచ్చు. ఆయనకు రాజకీయం తెలియదు. ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. ఇళ్లను కూల్చుతుంటే ఆదుకోవాల్సిన అమ్మలాంటి కేసీఆర్ ఎక్కడున్నారు..? మారుతారేమోనని చూశా.. కానీ, నన్నే సస్పెండ్ చేశారు. ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు పంపిన రోజే తాను మాట్లాడాల్సింది. కానీ, మాట్లాడలేదు.. ఇవాళ నాకు అదే జరిగింది. ఉద్యమంలో కొట్టినవారినే తీసుకొచ్చి పట్టం కట్టారు. వాళ్ల అనుచరులు మనవాళ్లను అణగతొక్కారు. ఉద్యమకారులను నామినేటెడ్ పోస్టులు ఇచ్చినా సరిపోయేది. కండువా వేసుకొని అప్పుడు పిచ్చోళ్లలాగా తిరిగాం. ఆ పార్టీలో అమ్మతనం పోయింది, మమకారం పోయింది. అందుకే కేసీఆర్ మన కేసీఆర్ కాదు. మరబొమ్మ అయ్యారు అని కవిత వ్యాఖ్యానించారు.

## ఎంతయినా ఒరిజినల్ ..ఒరిజినలే

మొదటిపేజీ తరువాయి

చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు. అంతేగాదు ఆయన ఫామ్‌హౌజ్నుంచి రారు అని కూడా కెసిఆర్‌పై సెటైలర్లు గుప్పించారు.

# వైద్య విద్యార్థుల వసతి భవనం పనులను వేగవంతం చేయాలి

## భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి )



జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 25 : వైద్య కళాశాల వైద్య విద్యార్థుల వసతి భవనం (హాస్టల్) పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బి, వైద్య కళాశాల ప్రిన్సిపల్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేవని, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నప్పటికీ పనులు ఆలస్యమవ్వడం సరికాదన్నారు. పనుల్లో వేగం పెంచేందుకు లేబర్ మొబిలైజేషన్‌ను పెంచాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరపు వైద్య అడ్మిషన్లు పూర్తి అయి విద్యార్థులు కళాశాలకు రానున్న నేపథ్యంలో, అప్పటికి అన్ని నిర్మాణ పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బెడ్స్, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, టిజి ఎం ఎస్ ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ధనుర్బాణ ఆంజనేయ ఆలయంలో స్వాముల ప్రత్యేక పూజలు

- మాలాధారణ స్వాములతో కిక్కిరిసిన ఆలయం.
- హనుమాన్ చాలీసా పారాయణంతో ఆధ్యాత్మిక వాతావరణం





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 25: రామగుండం రాజీవ్ రహదారిపై బీ-పవర్ హౌస్ చౌరస్తా సమీపంలోని రామునిగుండాల కొండపై స్వయంభుగా వెలసిన ధనుర్బాణ ఆంజనేయస్వామి ఆలయం నిత్యం హనుమాన్ భక్తులతో సందడిగా మారి ఆధ్యాత్మికతను పంచుతోంది. కొండగట్టు అంజన్న జయంతి మే 11న జరగనున్న నేపథ్యంలో హనుమాన్ భక్తులు 41, 21, 11 రోజుల మాలాధారణ దీక్షలు చేపడుతున్నారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మాలాధారణ స్వాముల సంఖ్య అధికంగా ఉండగా, ఇప్పటికే అనేక మంది దీక్షలు స్వీకరించి స్వామివారిని దర్శించుకుంటున్నారు. రామగుండం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి, అలాగే రాజీవ్ రహదారి గుండా ప్రయాణించే భక్తులు కూడా ధనుర్బాణ ఆంజనేయస్వామి స్వయంభుగా వెలసిన క్షేత్రంగా పేరుగాంచడంతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం హనుమాన్ మాలాధారణ స్వాములు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పూజారి సంతోష్ కుమార్ శర్మ భక్తులతో ఆధ్యాత్మిక ఆత్మీయతను పంచుకుంటూ హనుమాన్ చాలీసా పారాయణం, హనుమాన్ స్వామిని ఆరాధించే శ్లోకాల పారాయణం నిర్వహించారు. దీంతో మాలాధారణ స్వాముల్లో భక్తి భావం మరింత పెరిగింది. అనంతరం చందనాభిషేకం, పూలాభిషేకం, ప్రత్యేక అర్చనలు నిర్వహించి భక్తులకు హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ క్షేత్రంలో స్వయంభుగా వెలసిన ధనుర్బాణ ఆంజనేయస్వామి ప్రత్యేకతను గుర్తించి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ వేద బ్రాహ్మణుల సమక్షంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా 108 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు గుడి గోపుర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న ఆలయ గోపురాన్ని, భవిష్యత్తులో ప్రతిష్ఠించనున్న 108 అడుగుల హనుమాన్ విగ్రహ స్థలాన్ని మాలాధారణ స్వాములు తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి ఆధ్యాత్మిక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు కొండగట్టు అంజన్న ఆశీస్సులు లభించాలని ప్రత్యేక పూజల్లో ప్రార్థించారు. ఆలయ నిర్మాణం పూర్తై 108 అడుగుల హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠించబడిన తర్వాత రామగుండం జంక్షన్‌లోని ధనుర్బాణ ఆంజనేయస్వామి ఆలయం మరో కొండగట్టు క్షేత్రంగా అవతరిస్తుందనే ఆశాభావాన్ని భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్ లేకపోతే కవిత రాజకీయ ప్రస్తావనే ఉండేదా?

## భూపాలపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, ఏప్రిల్ 25:మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) లేకపోతే కల్వకుంట్ల కవితకు రాజకీయ భవిష్యత్తు ప్రస్తావనే ఉండేదా అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని రాకేష్ ప్రశ్నించారు. శనివారం ఆమె విలేకరులకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత ఇటీవల టీఆర్ఎస్ పార్టీ పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, తన తండ్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయికి రావడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రి రాజకీయ ఆశ్రయం, ప్రోత్సాహంతో ఎదిగిన కవిత, అదే వ్యక్తిని విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నో కొత్త పార్టీలు పెట్టి ప్రజలను మోసం చేసిన వారిని రాష్ట్రం ఇప్పటికే చూసిందని, కేవలం బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను బలహీనపరచడానికే ఈ కొత్త పార్టీ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. తాను ప్రసంగం చేసే ముందు తన గత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు ఎలా రూపుదిద్దుకుందో గుర్తు చేసుకోవాలని కవితకు సూచించారు. తెలంగాణలో ప్రస్తుతం దుర్మార్గమైన పాలన కొనసాగుతోందని, అలాంటి సమయంలో రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డను అక్కగా గౌరవించాలని చెప్పే స్థాయికి తీసుకువచ్చింది కూడా కేసీఆర్ నాయకత్వమేనని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని విమర్శించిన తీరును తాను తీవ్రంగా ఖండిస్తున్నానని జక్కు శ్రీహర్షిని స్పష్టం చేశారు.

# ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా అథ్లెటిక్ చైర్మన్ పంతకాని సమ్మయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




కాటారం, ఏప్రిల్ 25:జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా అథ్లెటిక్ చైర్మన్ పంతకాని సమ్మయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని తెలిపారు. నిత్యజీవితంలో ఒత్తిడి నుంచి ఉపశమనం కలగడంతో పాటు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. క్రీడలు జట్టుగా పనిచేసే తత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాలు కూడా ఉంటాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాటారం ఉపసర్పంచ్ కొండాగోర్ల బాణయ్య, ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, గంటా దేవదాస్, కుమ్మరి రమేష్, ఆత్మకూర్ కుమార్ యాదవ్, బీరెల్లి మహేష్, గజ్జల కిషోర్, మారపాక రాజేంద్రప్రసాద్, డాక్టర్ లింగమూర్తి, సమ్మిరెడ్డి, పూర్ణచందర్‌రావు, ఉపాధ్యాయులు అశోక్, నాగరాజు, పీఈటీలు లక్ష్మణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామివారి 36వ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం

## స్వామివారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 25:మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో స్వామివారి 36వ బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా భక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 'ఖని'లో లక్ష్మీనగర్ ట్రాఫిక్‌కు చెక్

- సిబ్బంది వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ - ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 25: గోదావరిఖని లక్ష్మీనగర్ లో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై శనివారం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్ రావు వ్యాపారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఖని లక్ష్మీనగర్ లోని సుమంగళి సెలక్షన్స్ ముందు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో వ్యాపారస్తులు పాల్గొని వారి ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసులకు వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ లక్ష్మీనగర్ లో ఇదివరకు చాలా చిన్న రోడ్లు ఉండేవని, కానీ ఇప్పుడు రోడ్లు రెండింతలు పెరగడం జరిగిందన్నారు. అయినా కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం జరుగుతోందని, అందుకు షాపులలో పనిచేసే వారు తమ టూ వీలర్ వాహనాలను షాపుల ముందు పెట్టడం కారణంగా తెలిపారు. వాహనాలను షాపుల ముందు నిలపడం మూలంగా తమ షాపుకు వచ్చే కస్టమర్లకు వారి వాహనాలను పెట్టుకునే చోటులేక రోడ్లపైకి వస్తున్నాయని అన్నారు. అందుకని షాపులలో పనిచేసే సిబ్బంది వాహనాలు పెట్టుకోవటానికి పోచమ్మ గుడి వద్ద, రీగల్ షూమార్ట్ దగ్గర తీసివేసిన వస్త్ర మూట వ్యాపారుల షాపుల స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తామని, షాపులలో పనిచేసే గుమాస్తాలు అందరూ అక్కడే తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అలాగే టూ వీలర్ నడిపేవారు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. ఈ అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్, ట్రాఫిక్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.



# సుప్రీం కోర్టు తీర్పు వెనక్కి తీసుకోవాలి

- దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు వర్తింపజేయాలి.
- బీఎస్పీ నేతల డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 25:మతం మారిన వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించదంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం అక్షేపనీయమనీ బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరికిల్ల రాజనర్సయ్య అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఎస్పీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన కులం మారదని, క్రిస్టియన్ మతంలో చేరిన దళిత క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని కోర్టు తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. ఈ విషయంలో బీఎస్పీ పార్టీ దళిత క్రిస్టియన్ల పక్షాన నిలబడి పోరాటం చేయడానికి సిద్ధమని తెలిపారు. మతం మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవని కోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరారు.

# అధికారులు గిరిజన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 25:అధికారులు గిరిజన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం, భూ బదిలీ నియంత్రణ (ఎల్‌టీఆర్) చట్టాలపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, పోలీస్, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రూపొందించిన అటవీ హక్కుల చట్టం, పేసా చట్టం, భూ బదిలీ నియంత్రణ (ఎల్‌టీఆర్) చట్టాలపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహనతో అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. గిరిజనుల హక్కులను పరిరక్షించడం ప్రతి అధికారియుటె బాధ్యత అని, చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే గిరిజనులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. చట్టాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ ఏపీవో నాగోరావు, డీఆర్‌డీఏ పీడీ చంద్రశేఖర్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అటవీ, పోలీస్ అధికారులు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

## మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 25: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే చెప్పారు. శనివారం మండల కేంద్రం పాపన్నపేటతో పాటు కొత్తపల్లి, కుర్తివాడ, నాగసాన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపిస్తూ, ఇది ప్రజల ప్రభుత్వమని పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కొంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్, ఏసు, శ్రీధర్, పాపయ్య, పాపన్నపేట ఉపసర్పంచ్, నాయకులు మల్లప్ప, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, నరేందర్ గౌడ్, మురళి, ముషెట్టి కిష్టయ్య, ధోసని సంగమేష్, కుర్తివాడ ప్రసాద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, ఎండి గౌస్, ఎండీ ఖలీం, బుక్క షాదుల్లా, సతీష్, నాని, రాజశేఖర్, పాపన్నపేట ఉపసర్పంచ్ ఎండీ సద్దాం హుస్సేన్, డ్వాక్రా గ్రూపు వీఓఏ అధ్యక్షురాలు వెంకటమ్మ, ఆయా గ్రామాల కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com